

బిందుకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

రైతు బిడ్డ సత్తా

చిలమత్తూరు: జిల్లా టాపర్‌గా నిలిచిన ఇంటర్ విద్యార్థిని బిందు.. తుమ్మలకుంట గ్రామానికి చెందిన రైతు భాస్కర్ రెడ్డి కూతురు. వెయ్యికి 980 మార్కులు సాధించిన బిందును కళాశాల ప్రిన్సిపాల్ భీముడునాయక్ అభినందించారు. వ్యవసాయం చేసుకుంటూ కూతురును చదివిస్తున్నానని, ప్రభుత్వ కళాశాలలో చదివి ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గర్వంగా ఉందని భాస్కర్ రెడ్డి అన్నారు. తన కూతురును ఉన్నతంగా చదివిస్తానని అన్నారు.

దుమ్మురేపారు..!

ఇంటర్‌లో గవర్నమెంట్ విద్యార్థుల సత్తా

మెరుగుపడిన ఉత్తీర్ణత శాతం

ప్రథమ సంవత్సరం 57 శాతం

ద్వితీయ సంవత్సరం 78 శాతం

గత ఏడాది 41.. 51 శాతం మాత్రమే

కొత్తచెరువు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాలలో ప్రభుత్వ యాజమాన్య కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. అత్యుత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులు, అధ్యాకులలో ఆనందం నింపారు. చిలమత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీసీ విద్యార్థిని పి.బిందు 980 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచినట్లు డీఐఈఓ రఘునాథరెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 11,548 మంది పరీక్షలు రాయగా 6,580 మంది ఉత్తీర్ణత సాధించారు. 57 శాతం ఉత్తీర్ణతతో జిల్లా రాష్ట్రంలో 24వ స్థానంలో నిలిచింది. రెండో సంవత్సరం జనరల్ విద్యార్థులు 9,711 మందికిగాను 7,575 మంది విద్యార్థులు పాసయ్యారు. 78 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా 21వ స్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు 1,538 మందికిగాను 692 మంది పాసై 45 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు 1,193 మందికిగానూ 858 మంది పాసై 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగింది. గత ఏడాదిలో ప్రథమ సంవత్సరం 42 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈ ఏడాది 57 శాతం నమోదైంది. ద్వితీయ సంవత్సరం గత ఏడాది 51 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈ ఏడాది 78 శాతం నమోదైందని డీఐఈఓ తెలిపారు. ప్రైవేటు కళాశాలల కంటే ప్రభుత్వ కళాశాలలలోనే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉందని ఆయన అన్నారు. కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ విద్యార్థిని నవరత్న 963/1000 మార్కులు, బైపీసీ విద్యార్థిని చందన 953/1000 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని సాహితీ రెడ్డి 450/470 మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రైవేటు కాలేజీలతో పోలిస్తే ప్రభుత్వ కాలేజీల విద్యార్థులే అత్యుత్తమ మార్కులను సాధించడం విశేషం.

మార్కుల పంట

● ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ మార్కులు సాధించారని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మి తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థినులు పల్లవి(958/1000), పర్వీన్ కౌసర్(954/1000), రుమానా (936/1000), సీఈసీ విద్యార్థిని జీవన (950/ 1000), హెచ్ఈసీ విద్యార్థిని మహేశ్వరి(908/1000), ఎంఎల్‌టీలో రూప(956/ 1000), ఒకేషనల్‌లో ఆస్మా(904/1000) మార్కులు సాధించారని తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో భవాని(461/470), గాయత్రి(457/470), బైపీసీలో సాయి శిల్ప(429/440), ఉషారాణి(427/440), సీఈసీలో నాగహారిక(420 /500), అంజుమ్(418/500) మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్, అధ్యాపకులు హజీపీరా, పెద్దన్న, రామాంజనులరెడ్డి, ప్రభాకర్ అభినందించారు.


నివేదిత (477)


లోకేశ్వరీ బాయి (467)


మోనిక (916)


శ్రీవల్లి (908)


అనిత (966)


సాయి సుభిక్షిత(960)


పల్లవి (958)


రూప (956)


భావని (461)


గాయత్రి (457)


సాయిశిల్ప (429)


ఉషారాణి (427)

కేజీబీవీలో వందశాతం ఉత్తీర్ణత

గోరంట్ల: ఖాజాపురం సమీపంలోని కేజీబీవీ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 79 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎస్ఓ శిరీష తెలిపారు. ద్వితీయ సంవత్సరం సీఈసీలో మొత్తం 24 మంది ఉత్తీర్ణత సాధించారని, మొదటి సంవత్సరంలో 33 మందికి 26 మంది ఉత్తీర్ణత సాధించారని ఆమె తెలిపారు. మొదటి సంవత్సరంలో నివేదిత 477, లోకేశ్వరీ బాయి 467, ద్వితీయ సంవత్సరంలో మోనిక 916, శ్రీవల్లి 908 మార్కులు సాధించారు. గోరంట్లలోని ఎస్‌పీపీఎస్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 142 మందికిగానూ 104 మంది ఉత్తీర్ణత సాధించారు. 73.2శాతం ఉత్తీర్ణత నమోదైందని ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యనారాయణ తెలిపారు. మొదటి సంవత్సరం 160 మందికి 84 మంది ఉత్తీర్ణత సాధించారని, 52.5 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. ద్వితీయ సంవత్సరం సీఈసీ విద్యార్థిని అనిత 966, ఎంపీసీ విద్యార్థిని సాయి సుభిక్ష 915 మార్కులు సాధించారని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థినులు నీలిమ (413/ 440), శ్వేత (433/470) మార్కులు సాధించారని తెలిపారు. ఎస్కేడీఆర్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 56 శాతం, ద్వితీయ సంవత్సరం 66 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు.


నీలిమ (413)


శ్వేత (433)

డబుల్ ధమాకా

● గుడిబండ ఎంజేపీ మొదటి సంవత్సరం 115 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 101 మంది పాసై.. వందశాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. తమ కాలేజీలో విద్యార్థులు ప్రతి సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని ప్రిన్సిపాల్ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు.

● రొళ్ల మండలం ఆవినకుంట కేజీబీవీ విద్యార్థులు వందశాతం ఫలితాలతో మెరిశారు. జూనియర్ ఇంటర్‌లో 27 మంది, సీనియర్ ఇంటర్‌లో 22 మంది పాసై.. వందశాతం ఉత్తీర్ణత నమోదు చేశారని కళాశాల ప్రిన్సిపాల్ మున్వర్‌జాన్ తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో ఎస్.హేమలత 416 మార్కులు, ఎం.చందు 413 మార్కులు, ఎన్.మహాలక్ష్మి 410 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో హెచ్.స్వప్న 944 మార్కులు, ఆర్.రక్షిత 943 మార్కులు, సి.శశికళ 940 మార్కులు సాధించారు.


శిరీష (926)


జీవన (950)


మహాశ్వేత (960)


కౌసర్ (880)


ఫైజా (887)

● కదిరి ప్రభుత్వ బాలికల కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 230 మందికిగానూ 184 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. హెచ్ఈసీ విద్యార్థిని మహాశ్వేత 960, ఎంపీసీ విద్యార్థినులు కౌసర్ 880, ఫైజా 887 మార్కులు సాధించారని తెలిపారు. బాలుర కళాశాలలో ద్వితీయ సంవత్సరం 303 మందికిగానూ 208 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ దామోదర్ తెలిపారు. ఎంపీసీ విద్యార్థి ఎస్.శ్రీనాథ్ 940, బైపీసీ విద్యార్థి ఎస్.ఇర్ఫాన్ 915 మార్కులు సాధించారని తెలిపారు.


శ్రీనాథ్ (840)


ఇర్ఫాన్ (915)

టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నం

జగన్‌పై వ్యాఖ్యలు చేశాడని వైసీపీ నాయకుల దాడి

ఇరువర్గాలపై కేసు.. పోలీసుల అదుపులో ముగ్గురు



హిందూపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ అధినేతపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారంటూ వైసీపీ కార్యకర్తలు ఓ టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నం చేశారు. చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దలకు చెందిన మోహన్ అనే టీడీపీ కార్యకర్త రెండ్రోజుల కిందట వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిపై అసభ్యకర వ్యాఖ్యలు చేశాడు. ఆ వీడియో శుక్రవారం వైసీపీ సోషల్ మీడియాలో వైరల్ అయింది. టీడీపీ కార్యకర్త మోహన్ కొన్నేళ్లుగా హిందూపురంలోని దండు రోడ్డు ప్రాంతంలో నివాసముంటున్నాడు. ఈ నేపథ్యంలో వీడియో ఆధారంగా అతడిని గుర్తించిన వైసీపీకి చెందిన పలువురు శుక్రవారం రాత్రి పట్టణంలోని రైల్వే రోడ్డులో మోహన్ ఉండగా బీర్‌బాటిల్‌తో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మోహన్‌ను స్థానికులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని పోలీసులు శనివారం మధ్యాహ్నం వరకు గోప్యంగా ఉంచారు. అయితే వైసీపీ నాయకుడు వేణురెడ్డి, కౌన్సిలర్లు వెళ్లి జగన్‌పై వ్యాఖ్యలు చేసిన మోహన్‌పై చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి ప్రతిగా బాధితుడు మోహన్ వైసీపీకి చెందిన సూరీ, శివతో పాటు మరో ముగ్గురు తనపై హత్యాయత్నం చేశారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ సమాచారం అందుకున్న వైసీపీ కార్యకర్తలు హిందూపురం వదలడానికి సిద్ధమయ్యారు. డీఎస్పీ మహేష్ దీనిని సీరియస్ తీసుకుని వారిని పట్టుకోవడానికి రెండు బృందాలు పంపారు. పోలీసులు వైసీపీకి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. జగన్‌పై వ్యాఖ్యలు చేసిన మోహన్‌ను సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై డీఎస్పీ మహేష్‌ను వివరణ కోరగా జగన్‌పై వ్యాఖ్యలు చేసిన మోహన్‌తో పాటు అతనిపై దాడికి పాల్పడిన వైసీపీకి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


సీఐకి ఫిర్యాదు చేస్తున్న వైసీపీ నాయకులు

కదిరిలో కాక..!



ఇంటర్ ఫెయిల్
పాస్ గ్యారంటీ కోచింగ్
తేజ రఘువీర టవర్స్, అనంతపురం సెల్: 9948567527, 9490859421

వేడి పుట్టిస్తున్న అవిశ్వాస వ్యవహారం

మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం కోసం హోరాహోరీ

అసలు సమస్య కోరమే ..! వ్యతిరేకవర్గ కౌన్సిలర్లపై వైసీపీ ప్రలోభాల ఎర


అవిశ్వాస తీర్మానానికే తమ ఓటు అంటున్న చైర్‌పర్సన్ వ్యతిరేక వర్గ కౌన్సిలర్లు (ఫైల్)

కదిరి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కదిరి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం వ్యవహారం రాజకీయ వర్గాల్లో కాక రేపుతోంది. తన కౌన్సిలర్లు చేజారిపోయి, వ్యతిరేకంగా మారకుండా ఉండటానికి వైసీపీ ప్రలోభాలకు తెర లేపినట్లు సమాచారం. కదిరి మున్సిపల్ చైర్ పర్సన్ నజీమున్నీసాపై ఈనెల 23న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. మున్సిపాల్టీలో మొత్తం 36 మంది సభ్యులకుగాను టీడీపీకి ఐదుగురు, వైసీపీకి 30, ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఉన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే కోరం తప్పనిసరి. సమావేశానికి కోరం కావాలంటే 24 మంది కౌన్సిలర్‌లు హాజరు కావాలి. సార్వత్రిక ఎన్నికల ముందు వైసీపీ నుంచి టీడీపీలోకి ఆరుగురు కౌన్సిలర్, ఇండిపెండెంట్ చేరారు. దీంతో టీడీపీ బలం 12 మందికి పెరిగింది. అయితే చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి 26 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా సంతకాలు పెట్టిన కౌన్సిలర్‌లకు వైసీపీ నాయకులు ఎర వేస్తున్నట్లు సమాచారం. వైసీపీ అధిష్ఠానం నుంచి ఫోన్‌లు చేయించి నయానో, భయానో వారిని దారికి తెచ్చుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో చైర్‌పర్సన్ వ్యతిరేక వర్గం కూడా తమ వద్ద ఉన్న కౌన్సిలర్లు ప్రలోభాలకు లొంగకుండా ఉండేందుకు తగు చర్యలు చేపట్టినట్లు తెలిసింది.

కౌన్సిలర్లకు వైసీపీ ఎర

తమ పార్టీ లోనే ఉంటూ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా సంతకాలు పెట్టిన కొంతమంది కౌన్సిలర్‌లకు వైసీపీ నాయకులు ఎర వేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం కౌన్సిల్ సమావేశం జరగాలంటే 24 మంది కౌన్సిలర్ తప్పకుండా సమావేశానికి హాజరు కావాలి. చైర్‌పర్సన్ వ్యతిరేక వర్గం ఇప్పటి వరకు 26 మంది ఉన్నారు. మిగిలిన 10 మంది చైర్‌పర్సన్ వర్గంలో ఉన్నారు. వ్యతిరేక వర్గంలో ఉన్న 26 మందిలో కనీసం ముగ్గురినైన తమ వైపు తిప్పుకుని సమావేశానికి హాజరుకాకుండా చేయాలనే ఆలోచనతో వైసీపీ ఉన్నట్లు తెలుస్తోంది. అందుకోసం స్థానికంగా ఉన్న వైసీపీ ఇన్‌చార్జ్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. తమకు అనుకూలంగా ఉన్న ముగ్గురికి ఆయన ఫోన్‌లు చేసినట్లు తెలిసింది. అవసరమైతే పెద్ద మొత్తం ముట్టజెప్పేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

కౌన్సిలర్లను కాపాడుకునేందుకు తంటాలు

చైర్‌పర్సన్ అనుకూల, వ్యతిరేక వర్గాలు తమ వద్ద ఉన్న కౌన్సిలర్లను కాపాడుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది. వ్యతిరేక వర్గంలో ఉన్న 26 మందికి తోడు మరో నలుగురిని తమ వైపు రప్పించడానికి వారు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఉన్న 26 మందిలో కొంతమందికి వైసీపీ నాయకులు ప్రలోభాలకు గురిచేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. కొత్త చైర్ పర్సన్ వస్తే తమ వార్డుల్లో అభివృద్ధి జరుగుతుందని వారు ఆశల్లో ఉన్నట్లు చెబుతున్నారు. నాలుగేళ్లుగా వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి లేకపోవడం వల్లే తాము చైర్‌పర్సన్‌కు వ్యతిరేకం అయ్యామని చెబుతున్నారు. గతంలోనే చైర్‌పర్సన్ రాజీనామా కోసం గట్టిగా ప్రయత్నించామన్నారు. అయితే అప్పటి ఎమ్మెల్యే సిద్దారెడ్డి మాట వల్ల వెనక్కు తగ్గామంటున్నారు. మరో పక్క చైర్‌పర్సన్ అనుకూల వర్గంలో ఉన్న పది మందిలో వ్యతిరేకవర్గంతో టచ్‌లో ఉన్న మరో నలుగురు ఎవరు అన్న సందేహంలో వైసీపీ నాయకులు ఉన్నారు. కాగా తమ వ్యతిరేక వర్గంలో ఉన్న ముగ్గురిని తమ వైపు తిప్పుకోవడానికి వైసీపీ నాయకులు నానా తంటాలు పడుతున్నట్లు తెలిసింది.

అడ్డదారుల్లో వైసీపీ

మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని నిలుపుకోవడానికి వైసీపీ అడ్డదారులు తొక్కుతున్నట్లు సమాచారం. తమకు ఉన్న 30 మంది కౌన్సిలర్లలో దాదాపు 20మంది కౌన్సిలర్లు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. చైర్‌పర్సన్‌ను దింపాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. టీడీపీతో కలిసి తమ చైర్‌పర్సన్‌ను దింపడానికి సిద్ధమయ్యారు. బాహాటంగానే సంతకాలు చేసి కలెక్టర్‌కు ఇచ్చారు. ఈనేపథ్యంలో తమకు బలం లేదని తెలిసినా వైసీపీ తమ కౌన్సిలర్‌ల కోసం అడ్డదారులు తొక్కుతున్నట్లు తెలిసింది. 26 మంది కౌన్సిలర్‌లో ముగ్గురిని తమ వైపు తిప్పుకోవడానికి పెద్ద ఎత్తున డబ్బు కూడా వెచ్చిస్తున్నట్లు తెలిసింది.

ఘనంగా తమిళ నూతన సంవత్సర వేడుకలు



అలరించిన నందనార్‌నాటిక

పుట్టపర్తి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తమిళ భక్తులు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతి నిలయంలో సాయికుల్వంతులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేదపఠనంతో తమిళ నూతన సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆ రాష్ట్ర భక్తులు గంటపాటు సంగీత గాన కచేరి చేపట్టారు. సాయంత్రం బాలవికాస్ చిన్నారులు నందనార్ పేరిట నాటిక నిర్వహించారు. సత్యసాయి ప్రేమ తత్వం, శివపురాణం ఘట్టాలను నాటిక ద్వారా తెలియజేశారు, చిన్నారులు సంగీత నృత్యంతో భక్తులను అలరించారు. అనంతరం సత్యమహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో వేలాది తమిళభక్తులు పాల్గొన్నారు.


నాటికలోని దృశ్యాలు

రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గంలో రైతు సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈనెల 17న నియోజకవర్గానికి వస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వై.బి.హళ్లి, కదిరేపల్లి, అగళి మండలంలోని ఇనగలూరు, అమరాపురం మండలంలోని పి.శివరం గ్రామాల్లో కొత్త సబ్‌స్టేషన్‌లను ప్రారంభిస్తార ని తెలిపారు. గుండుమల, రొళ్ల మండలం రంగనపల్లి, గుడిబండ మండలం కేకేపాళ్యం గ్రామాల్లో మూడు కొత్త సబ్‌స్టేషన్‌లకు భూమి పూజ చేయనున్నట్లు వెల్లడించారు. రైతులకు సంబంధించి లోఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే తమ ప్రభుత్వం వంద ట్రాన్స్ ఫార్మర్‌లను రైతులకు అందించినట్లు తెలిపారు. మడకశిరలో 220 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. రొళ్ల, అగళి మండలాల మధ్యలో 132 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి రైతు సమస్యలు శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు.



ధర్మవరం మున్సిపల్ కార్యాలయం

ఏటేటా 15శాతం





మున్సిపాల్టీల్లో మళ్లీ పెరిగిన ఆస్తి పన్ను

- ఈనెల ఒకటో తేదీ నుంచే అమలు
- ఐదేళ్లలో రెట్టింపు
- లబోదిబోమంటున్న పట్టణ ప్రజలు

మున్సిపాల్టీల్లో ఆస్తి పన్ను 15శాతం మళ్లీ పెరిగింది. ఈ పెంచిన పన్ను ఈనెల ఒకటో తేదీ నుంచే అమల్లోకి వచ్చింది. దీంతో జిల్లాలోని పట్టణ ప్రజలపై రూ.కోట్లలో పన్ను భారం పడినట్లు అంచనా. ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ప్రతి ఏటా పెరుగుతోంది. పట్టణ ప్రాంతాల్లో గృహ యజమానులపై పన్నుల రూపంలో పడుతున్న ఆర్థిక భారం మున్సిపాలిటీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. దీనిపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ధర్మవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీల్లో ఉన్న పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మార్చేసింది. గతంలో మార్కెట్ విలువ (రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా ఆస్తి విలువ, మున్సిపాలిటీల్లో జోన్ల వారీగా రేట్లు నిర్ణయించి పన్ను విధించేవారు. ఈ విధానం 1997 నుంచి అమలు అవుతోంది. భవన నిర్మాణ కొలతలను కూడా పరిగణలోకి తీసుకునేవారు. మున్సిపాలిటీ గెజిట్ ప్రకారం జోన్ల వారీగా పన్ను నిర్ణయించే వారు. గతంలో భవనానికి మాత్రమే పన్ను విధించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్త విధానంలో భవనంతోపాటు చుట్టూ ఖాళీ వదిలితే ఈ స్థలానికి కూడా పన్ను విధించారు. దీంతో పన్ను అమాంతం పెరిగింది. ఆస్తి విలువ ఆధారంగా గతంలో చెల్లిస్తున్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించిన పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారించారు. తేడా ఉన్న ప్రకారం ఏటా 15శాతం పన్ను పెంచుతూ వస్తున్నారు. ఈ పన్నుల విధానం సరైనది కాదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఉదాహరణకు ఓ వ్యక్తి ఇంటికి ఏటా రూ.492 పన్ను చెల్లించే వాడు. దీనికి ఏటా ప్రభుత్వం 15శాతం చొప్పున పెంచేస్తోంది. ఇలా వరుసగా పెరిగిన పన్నుతో ఐదేళ్లకు అది రూ.990కి చేరింది. ఇలా జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో ఇదే స్థాయిలో పన్నులు పెరిగాయి.

50శాతం వడ్డీ రాయితీ అమలు

పన్ను బకాయిదారుల నుంచి వసూలు చేసిన ఆస్తి పన్నుపై ప్రభుత్వం 50శాతం వడ్డీరాయితీని ప్రకటించింది. గత ఆర్థికసంవత్సరంలో ఆస్తి పన్నుపై వడ్డీ చెల్లించిన వారికి దానిలో 50శాతం తిరిగి ఇస్తోంది. అయితే ఈ మొత్తాన్ని ఆ ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఆరునెలలకు సంబంధించిన పన్నులో తగ్గించారు. వడ్డీ రాయితీని పన్నుదారులకు తిరిగి చెల్లించినట్లుగా పన్నుదారుల ఖాతాను పరిశీలిస్తే తెలుస్తోంది.


ధర్మవరం పట్టణ ముఖచిత్రం

5శాతం రాయితీ

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై ప్రభుత్వం 5శాతం రాయితీ అమలు చేస్తోంది. ఈ నెలాఖరిలోగా చెల్లిస్తే ఈ రాయితీ వర్తిస్తుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. రాయితీపై మున్సిపల్ అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి పన్ను చెల్లిస్తున్నారు.

కొనసాగుతున్న వైసీపీ విధానం

మున్సిపాలిటీల్లో పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం 2020-21లో మార్చేసింది. ఆస్తి విలువ ప్రకారం పన్నును ఏటా 15శాతం పెంచేలా నిర్ణయించింది. ఈ ప్రకారం గత నాలుగేళ్లు పన్ను పెంచుతూ వచ్చింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పన్నుల విధానాన్ని మారుస్తుందని ప్రజలు ఆశించారు. కానీ అలా జరగలేదు. ఈ ప్రభుత్వం కూడా వైసీపీ పన్నుల పెంపు విధానాన్ని కొనసాగించినట్లు తేలింది. ప్రతి ఏటా పన్నుల పెంపుతో నాలుగైదేళ్లలోనే పన్నుల భారం రెట్టింపైంది. ఆస్తి పన్ను విషయంలో వైసీపీ విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అమలు చేస్తుండటంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పన్నులు పెరిగితే గృహ యజమానులు అద్దెలు పెంచుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

పరిగి, ఏప్రిల్ 12(ఆంధ్ర జ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయ (కేజీబీవీ)లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శనివారం అదృశ్యమైంది. ఎస్ఐ రంగడు తెలిపిన వివరాల మేరకు.. లేపాక్షి మండలం భయన్నపల్లికి చెందిన ఓ విద్యార్థిని పరిగి కేజీబీవీలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఇంటర్ పరీక్షా ఫలితాలు శనివారం వెలువడటంతో విద్యార్థిని ఎకనామిక్స్ సబ్జెక్టు తప్పింది. దీంతో మనస్తాపం చెంది కళాశాలలోని బాత్‌రూం గోడ దూకి వెళ్లిపోయింది. హాస్టల్‌లో విద్యార్థిని కనిపించకపోవడంతో సిబ్బంది పరిసర ప్రాంతాల్లో వెతికారు. కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు హాస్టల్ వద్దకు చేరుకుని, ఆరాతీశారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఎస్ఓ సువర్ణ భారతి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల జిల్లా కమిటీ ఎన్నిక

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శుల జిల్లా కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్మోహన్, ఉపాధ్యక్షుడు శంకర్, ప్రచార కార్యదర్శి ఓంప్రకాష్ అధ్యర్యంలో ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా దాదిరెడ్డి విశ్వనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్, గౌరవాధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి, కోశాధికారిగా శ్రావణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు దాదిరెడ్డి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తానని ఆయన తెలిపారు.


గ్రామ పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

భవితకు భరోసా

- భవిత కేంద్రాలకు ప్రభుత్వ సాయం
- పెండింగ్ నిధుల పంపిణీ
- విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు..
- ఉమ్మడిజిల్లాలో 6267 మందికి లబ్ధి


పంపిణీకి సిద్ధంగా ఉన్న ఉపకరణాలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాలకు ఊతం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపుతోంది. దీంతో దివ్యాంగుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఉమ్మడి జిల్లాలో 63 మండలాలకు గాను 63 భవిత కేంద్రాలున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 32 భవిత కేంద్రాల్లో 3215 మంది, అనంతపురం జిల్లా 31 మండలాల్లో 3052 మంది దివ్యాంగ బాలలున్నారు. వీరిలో 1260 మందే భవిత కేంద్రాలకు వస్తున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వీరిలో చాలామంది నిరుపేదలే. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. దివ్యాంగ బాలలకు చెల్లించాల్సిన అలవెన్సులను వారి తల్లుల ఖాతాల్లోకి జమచేస్తున్నారు. భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి సైతం వేతనాలు సక్రమంగా అందుతున్నాయి. బాలలకు అవసరమైన ఉపకరణాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

బాలలకు భత్యం విడుదల

గత ప్రభుత్వం భవిత కేంద్రాలను నిర్వీర్యం చేసి దివ్యాంగులను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం గత ఏడాది నవంబరు నెలలోనే దివ్యాంగ బాలలకు రవాణా భత్యం కింద 10నెలలకు ఒక్కో విద్యార్థికి మూడువేలు, పీఎంశ్రీ పాఠశాల దివ్యాంగ బాలికలకు స్టైఫండ్ కింద పదినెలలకు రూ 3వేలు, మిగతా పాఠశాలల్లోని బాలికలకు రూ 2వేలు, సొంతంగా బడికి వెళ్లలేని చిన్నారులకు సహాయకులకు వస్తున్న వారికి ఎస్కార్టు అలవెన్సు రూ.3వేలు చొప్పున మంజూరు చేసింది. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి 1936 మంది విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు ఇందులో నాలుగు రకాల అలవెన్సులకు గాను 58.24లక్షలు వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేసినట్లు కో-ఆర్డినేటర్ ఆనందబాబు తెలిపారు.

ఉపకరణాల పంపిణీ

గత ఏడాది జిల్లాలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉపకరణాలను తయారు చేయించారు. ఈమేరకు ఈనెల 8న కొత్తచెరువులో 277 మంది దివ్యాంగ విద్యార్థులకు ట్రైసైకిళ్లు 57, సీపీ వీల్‌ఛైర్‌లు 26, వినికిడి యంత్రాలు 64 టీఎల్ఎం (టీచర్‌లెర్నింగ్ మెటీరియల్‌కిట్లు) రోటేటర్లు 44, బ్రెయిలీ కిట్లు 2 ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి చేతులు మీదుగా అందజేశారు.

నేత్రదానం

అనంతపురం టౌన్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): అనంతపురంరూరల్ మండలం చంద్రబాబునగర్‌కు చెందిన రామన్న (80) మరణించడంతో ఆయన కళ్లను కుమారులు దానం చేశారు. రామన్న వయసు రీత్యా సహజమరణం పొందారు. ఆయన కుటుంబసభ్యులను సామాజిక కార్యకర్తలు ఆలంబన జనార్ధన్, క్యాటరర్ రామకృష్ణ కలిసి కళ్లదానంచేస్తే మరో ఇద్దరికి చూపు ఇచ్చిన వారవుతారని కోరారు. ఇందుకు రామన్న కుమారులు శ్రీనివాసులు, గోవింద్‌తోపాటు కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో పాతూరు రెడ్‌క్రాస్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన డీవై కుళ్లాయప్ప ఐసెంటర్ డాక్టర్లు.. రామన్న కళ్లను సేకరించారు. రామన్న కుటుంబసభ్యులను డాక్టర్లు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు అభినందించారు.


రామన్న కళ్లను దానం చేస్తున్న కుటుంబసభ్యులు


పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఏరా.. ఎలా ఉన్నావ్?

పూర్వ విద్యార్థుల కుశల ప్రశ్నలు
పెనుకొండలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెనుకొండ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఏరా..! ఎలా ఉన్నావ్? ఎన్నేళ్లయ్యిందిరా చూసి. ఏమ్మా బాగున్నావా? పిల్లలెంతమంది? ఏం చేస్తున్నారు? అంటూ 33ఏళ్ల తరువాత కలిసిన వారంతా కుశల ప్రశ్నలు వేసుకున్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 1991-92 సంవత్సరంలో చదివిన పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం శనివారం జరిగింది. మొత్తం 80మంది ఒక్కచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ చిన్న పిల్లల్లా మారిపోయారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులు జ్యోతిర్మయి, జయలక్ష్మమ్మ, మనోరంజనమ్మ, నాగరాజు, శ్యామలమ్మను ఘనంగా సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు అంతా కలిసి ఓ ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి పేద విద్యార్థులు, ఉపాధ్యాయుల వైద్య ఖర్చులకు చేయూతనందించాలని నిర్ణయించారు.

ఊరి బడిని ఉద్ధరిద్దాం


పూర్వవిద్యార్థులు, గ్రామ పెద్దల నిర్ణయం.. ఘనంగా 65వ వార్షికోత్సవం

బెళుగుప్ప, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మన ఊరి బడిని మనమే బాగు చేసుకుందామని పూర్వవిద్యార్థులు, గ్రామ పెద్దలు ఓ నిర్ణయానికి వచ్చారు. మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామ ప్రాథమిక పాఠశాల 65వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ పాఠశాల్లో చదివిన ఆదిమూర్తి డీఎస్పీగా ఎదిగి, పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ పాఠశాలకు క్రీడా సామగ్రి, విద్యా కార్యక్రమాలకు సహాయ, సహకారాలు కూడా అందిస్తున్నారన్నారు. పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు మాజీ వైఎస్ ఎంపీపీ తిమ్మప్ప, నాగరాజు, శ్రీనాథ్, ఎర్రిస్వామి, మారుతి, శ్రీనివాసులు, సిద్ధలతో పాటు మరికొంతమంది కలిసి వార్షికోత్సవానికి అయ్యే ఖర్చును మొత్తం భరించి, పాఠాలు చెప్పిన ఆనాటి గురువులను పెద్ద ఎత్తున సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. కార్యక్రమంలో గ్రామ సర్పంచు రత్నమ్మ, రామాంజినేయులు, ఎంఈఓ మల్లారెడ్డి, హెచ్ఎం వెంకట సురేష్, ఉపాధ్యాయులు, వజీర్ బాషా, వేణుగోపాల్, సరస్వతి, నల్లపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

క్షేత్ర స్వాహాయకురాలు..!



ఈ ఫొటోతో ఏడు మస్టర్లను అప్‌లోడ్ చేశారు..

- అవాక్కయ్యేలా అక్రమాలు
- ఒకే ఫొటోతో ఏడు మస్టర్లకు బిల్లులు
- ఒకేరోజు 1,400 మందికి ఉపాధి పని!
- బట్టబయలైన ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేరా?

నార్పల, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఒక గ్రామ పంచాయతీలో ఒకేరోజు 1,400 మందికి ఉపాధి పని.. ఒకే ఫొటోతో ఏడు మస్టర్లకు బిల్లులు.. ఇవన్నీ నమ్మడానికే విడ్డూరంగా ఉన్నాయి. అయినా.. వాటిని చేశారు.. కాదు, చేసినట్లు చూపించారు.. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఓ క్షేత్ర సహాయకురాలు (ఫీల్డ్ అసిస్టెంట్). మండలంలోని ఓ పంచాయతీలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకురాలు స్వాహా పర్వానికి తెరలేపారు. అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారు. రాజకీయ అండదండలంతో పేట్రేగిపోతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు మేట్లతో కుమ్మక్కై, ఉపాధి హామీ పనులకు రాకపోయినా వారి పేర్లను పెట్టి లక్షలాది రూపాయలు స్వాహా చేస్తున్నారు. ఇటీవలే ఉపాధిలో అవినీతిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)ను ప్రవేశపెట్టింది. అయినా.. ఆ ఫీల్డ్ అసిస్టెంట్ ఖాతరు చేయలేదు. ఆ పంచాయతీ పరిధిలో గత నెల 25 నుంచి నీటి సంరక్షణ కోసం ట్రెంచ్ పనులు చేపట్టారు. వాటికి 21 మంది కూలీలు మాత్రమే హాజరయ్యారు. వారి ఫొటో తీసి 56 మంది హాజరైనట్లు అప్‌లోడ్ చేసి, ఏకంగా 7 మస్టర్లకు బిల్లులు పెట్టారు. ఇలా గతంలో కూడా చేయడంతో ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌ను డ్వామా పీడీ గట్టిగా మందలించారు. అయినా తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ ఆ ఫీల్డ్ అసిస్టెంట్ ఎదురు సమాధానం చెప్పినట్లు సమాచారం. దీంతో ఆ ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు.


ఉపాధి కూలీలతో విచారణ చేస్తున్న ఏపీడీ చెన్నకేశవులు (ఫైల్)

అవాక్కైన విచారణాధికారి

మండలంలో ఆ ఫీల్డ్ అసిస్టెంట్ పనిచేస్తున్న పంచాయతీలో ఏపీడీ చెన్నకేశవులు విచారణ చేపట్టారు. ఈనెల 9న 1,400 మంది కూలీలు హాజరైనట్లు ఫొటోలతో మస్టర్లు రూపొందించి, అధికారులకు పంపారు. ఏపీడీ చెన్నకేశవులు ఆ ఫొటోలను పరిశీలించారు. ఇందులో వెయ్యి మందికిపైగా పనులకు రాలేదని గుర్తించారు. ఒకే ఫొటోనే అప్‌లోడ్ చేసినట్లు గుర్తించి అవాక్కయ్యారు. 'ఒక్కరోజే వెయ్యి మందిపైగా పనులకు రాకపోయినా వచ్చినట్లు ఏ ధైర్యంతో పెట్టారనీ, అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారనుకున్నారా?' అంటూ ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆ ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై పూర్తి నివేదిక రూపొందించి, ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం.

పైసలిస్తేనే పని..

మండలంలోని ఆ పంచాయతీలో పని కల్పించాలంటే మొదట ఆ గ్రూప్ కూలీలు ఒక్కొక్కరు రూ.500 ఇచ్చుకోవాల్సిందేనన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లేదంటే ఆ వారం మొత్తంగా ఆ గ్రూప్‌కి పనులు పెట్టరని తెలసింది. ఎవరికైనా జాబ్ కార్డు కావాలంటే ముందుగా వెయ్యి ముట్టజెప్పాల్సిందేనన్న విమర్శలున్నాయి. ఆ ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై టీడీపీ, జనసేన నాయకులు ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఉన్నతాధికారికే బెదిరింపులు

తన అక్రమాలపై ప్రశ్నించిన అధికారినే ఆ ఫీల్డ్ అసిస్టెంట్ బెదిరించినట్లు తెలిసింది. సెలవులోగానీ, బదిలీపైగానీ వెళ్లిపోవాలనీ, లేదంటే అంతు చూస్తానని తీవ్రస్థాయిలో హెచ్చరించినట్లు సమాచారం. ఫీల్డ్ అసిస్టెంట్‌కు మద్దతుగా వ్యవహరించాలనీ, చూసీచూడనట్లు వ్యవహరించాలని ఆ అధికారికి కొందరు రాజకీయ నాయకులు చెప్పినట్లు తెలిసింది. ఆ ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలు ఆధారాలతో బట్టబయలైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో.. లేదో వేచిచూడాలి.

కొన్నింట అద్భుతం

ఐదు వెల్ఫేర్ కాలేజీలు, ఒక కేజీబీవీలో వందశాతం ఉత్తీర్ణత

మొదటి సంవత్సరం కణేకల్లు వెల్ఫేర్, కూడేరు కేజీబీవీలో కూడా..



కూడేరు కేజీబీవీ

అనంతపురం విద్య, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య కాలేజీలు ఇంటర్ ఫలితాల్లో దుమ్మురేపాయి. సోషల్ వెల్ఫేర్, కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణత కూడా నమోదైంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, సోషల్ వెల్ఫేర్ కాలేజీలు, ఎయిడెడ్ కాలేజీల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 6,897 మందికి గానూ 6,652 మంది పరీక్షలు రాశారు. వీరిలో 3,286 మంది పాసై.. 49.40శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం 5,056 మందికిగానూ 4,921 మంది పరీక్షలు రాశారు. వీరిలో 3,500 మంది పాసై.. 71. 12 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు.

మొదటి సంవత్సరం..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ఆత్మకూరు 84.54 శాతంతో మొదటి స్థానంలో నిలువగా, బెళుగుప్ప 9.52 శాతంలో ఆఖరి స్థానంలో నిలిచాయి. కేజీబీవీల్లో కూడేరు 100 శాతంతో ప్రథమ స్థానంలో నిలవగా, తాడిపత్రి కేజీబీవీలో 15 శాతం మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. మోడల్ స్కూళ్లలో తాడిపత్రి 80.77 శాతంతో అగ్రస్థానం, యాడికి మోడల్ స్కూల్‌లో 23.86 శాతంతో ఆఖరు స్థానంలో నిలిచాయి. వెల్ఫేర్ కాలేజీల్లో కణేకల్లు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ(బాయ్స్) 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గొల్లలదొడ్డి ట్రైబల్ వెల్ఫేర్ కాలేజీలో 11.90 శాతం మాత్రమే పాసయ్యారు. రెండు ఎయిడెడ్ కాలేజీల్లో 713 మందికిగాను 697 మంది హాజరు కాగా 159 మంది పాసయ్యారు. 22.81 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బ్రహ్మసముద్రం జడ్పీ హైస్కూల్(ప్లస్)లో 20 మందికి ఐదుగురు మాత్రమే పాసయ్యారు. 25 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

సెకెండ్ ఇయర్..

ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,921 మందికిగానూ 3500 మంది పాసయ్యారు. 71.12 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఐదు వెల్ఫేర్ కాలేజీలు, ఒక కేజీబీవీలో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 22 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆత్మకూరు జూనియర్ కళాశాలలో అత్యధికంగా 98.89 శాతం మంది పాసయ్యారు. అనంతపురం బాలుర జూనియర్ కళాశాలలో అత్యల్పంగా 41.22 శాతం ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీల్లో కూడేరులో అధికంగా 100 శాతం ఉత్తీర్ణత, యల్లనూరులో అత్యల్పంగా 9.52 శాతం ఉత్తీర్ణత వచ్చింది. 15 మోడల్ స్కూళ్లలో అధికంగా కణేకల్లు మోడల్ స్కూల్‌లో 90.91 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సోషల్ వెల్ఫేర్ కాలేజీల్లో కురుగుంట గర్ల్స్ కాలేజ్, పెద్దపప్పూరు బాయ్స్ కాలేజ్, ఉరవకొండ గర్ల్స్ కాలేజ్, కణేకల్లు బాయ్స్ కాలేజ్, బ్రహ్మసముద్రం గర్ల్స్ కాలేజ్‌లో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గొల్లలదొడ్డి ట్రైబల్ వెల్ఫేర్ కాలేజీ అత్యల్పంగా 56.52 శాతం ఉత్తీరత తో చివరిలో నిలిచింది.



లలిత, ఎంపీసీ (960)



హర్షవర్ధన్, ఎంపీసీ (966)



శ్రావణి (936)



విష్ణువరుణ్ 930

● ఉరవకొండ ప్రభుత్వ బాలబాలికల జూనియర్ కాలేజీల విద్యార్థులు గత ఏడాది కంటే ఎక్కువశాతం పాసయ్యారని ప్రిన్సిపాల్ మమత తెలిపారు. బాలికల కాలేజీలో ద్వితీయ సంవత్సరం 129 మందికిగానూ 104 మంది, ప్రథమ సంవత్సరం 182 మందికిగానూ 86 మంది పాసయ్యారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని ఉమాదేవి 435 మార్కులు, హెచ్‌ఈసీ విద్యార్థిని లావణ్య 431 మార్కులు సాధించారు. ● బాలుర కాలేజీలో ద్వితీయ సంవత్సరం 119 మందికిగాను 92 మంది, ప్రథమ సంవత్సరం 147మందికి 68 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో జ్ఞానేశ్వర్ 454 మార్కులు సాధించాడు. ఒకేషనల్ గ్రూప్‌లో ప్రథమ సంవత్సరంలో 32శాతం, ద్వితీయ సంవత్సరం 70శాతం ఉత్తీర్ణత సాధించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ద్వితీయ సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. పథమ సంవత్సరంలో 99 శాతం ఉత్తీర్ణత నమోదైందని ప్రిన్సిపాల్ జ్ఞానప్రసూన తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్లో ప్రథమ సంవత్సరం 36 శాతం, ద్వితీయ సంవత్సరం 74శాతం ఉత్తీర్ణత నమోదైందని ప్రిన్సిపల్ ప్రశస్థకుమారి తెలిపారు. వజ్రకరూరు మోడల్ స్కూల్లో ప్రథమ సంవత్సరం 45శాతం, ద్వితీయ సంవత్సరం 52 శాతం ఉత్తీర్ణత నమోదైందని ప్రిన్సిపాల్ శ్యామల తెలిపారు.



శ్రావణి (961)

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో రెండోస్థానంలో నిలిచింది. కేజీబీవీ మూడో స్థానంలో నిలిచింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 216 మందికి గాను 151 మంది పాసై 70 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో 203 మందికి గాను 191 మంది పాసై 94.5శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ మోహన్‌కుమార్ తెలిపారు. మొదటి సంవత్సరం సీఈసీ విద్యార్థిని సుస్మిత 413 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని గౌరమ్మ 922 మార్కులు, బైపీసీ విద్యార్థిని శ్రావణి 961 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. కేజీబీవీలో మొదటి సంవత్సరం సీఈసీ విద్యార్థులు 36 మంది గాను 30 మంది, ద్వితీయ సంవత్సరం 34 మందికి 32 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ కమలమ్మ తెలిపారు. సాయికీర్తన 854, లావణ్య 828, ఐశ్వర్య 828 మార్కులు సాధించారని తెలిపారు.



అనంతకు 823.. శ్రీసత్యసాయి జిల్లాకు 604..

ఎస్సీ సబ్సిడీ రుణాల యూనిట్లు ఖరారు

రేపట్నుంచి దరఖాస్తులు... నిరీక్షణకు తెర

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సబ్సిడీ రుణాలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆయావర్గాల నిరీక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తెరదించింది. ఈ మేరకు శనివారం ఉమ్మడి అనంత జిల్లాకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ వర్గాలకు రుణాలు అందించేందకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందులో భాగంగానే వివిధ రకాల రుణాల జాబితాను రూపొందించి యూనిట్ల వరకూ నిధులను కేటాయించింది. అనంత జిల్లాకు 823 యూనిట్లకుగానూ... రూ.34.21 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 604 యూనిట్లకు రూ.25.14 కోట్ల నిధులను విడుదల చేసింది. దీంతో కొంతకాలంగా సబ్సిడీ రుణాల కోసం ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గాలకు ఉపశమనం కలిగించిందనే చెప్పాలి. ఈనెల 14వతేదీ నుంచి apobmms వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

సెక్టార్ల వారీగా రుణాల వివరాలు...

అనంతపురం జిల్లాకు సంబంధించి ఐఎస్‌బీ సెక్టార్-1లో రూ.3లక్షల లోపు రుణాలను కేటాయించగా.. 151 యూనిట్లకు రూ.4.16 కోట్ల నిధులను విడుదల చేసింది. ఐఎస్‌బీ సెక్టార్-లో రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల లోపు రుణాలను కేటాయించగా... 418 యూనిట్లకు రూ.16.05 కోట్లు, ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్(ఈ-ఆటోలు)లో రూ.3 లక్షలలోపు రుణాలు కేటాయించగా... 154 యూనిట్లకు రూ.4.62 కోట్లు, ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌లో రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల రుణాలను కేటాయించగా.. 93 యూనిట్లకు రూ.8.68 కోట్లు, అగ్రికల్చర్ సెక్టార్ (డ్రోన్ల)లో ఐదుగురు సభ్యులను గ్రూపుగా కలిపి 7 యూనిట్లకు రూ.70 లక్షల నిధులను విడుదల చేసింది.

శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి ఐఎస్‌బీ సెక్టార్-1లో రూ.3 లక్షల లోపు రుణాలను కేటాయించింది. ఇందుకు 110 యూనిట్లను కేటాయిస్తూ... రూ.3.02 కోట్ల నిధులను విడుదల చేసింది. ఐఎస్‌బీ సెక్టార్-2లో రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల్లోపు రుణాలను కేటాయించింది. ఇందులో 305 యూనిట్లకు రూ.11.72 కోట్లు, ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్(ఈ-ఆటోలు)లో రూ.3 లక్షలోపు రుణాలను కేటాయించింది. ఇందులో 115 యూనిట్లకుగానూ రూ.3.45 కోట్లు, ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌లో రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల రుణాలను కేటాయించింది. ఇందులో 69 యూనిట్లకు రూ.6.44 కోట్లు, అగ్రికల్చర్ సెక్టార్(డ్రోన్ల)లో ఐదుగురు సభ్యులు గ్రూపుగా కలిపి ఐదు యూనిట్లకుగానూ రూ.50 లక్షలు కేటాయించింది.

దరఖాస్తు ఇలా...

ఎస్సీ సబ్సిడీ రుణాల కోసం అభ్యర్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తెల్లరేషన్‌కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండాలి. లబ్ధిదారు వయసు 21 నుంచి 50 ఏళ్లలోపు ఉండాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. ఆటో రుణాలకు దరఖాస్తు చేసుకునే వారు వ్యాలీడ్ లైసెన్స్, బ్యాడ్జి ఉండాలనే నిబంధన పెట్టారు. కుటుంబానికి ఒకరు మాత్రమే రుణాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఉద్యోగులు, విద్యార్థులు అనర్హులు.



ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లు, సంక్షేమ శాఖల భవన సముదాయం

సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సబ్సిడీ రుణాలను ఎస్సీ వర్గాలు సద్వినియోగం చేసుకోవాలి. ఐదు సెక్టార్ల వారీగా రుణాలను రూపొందించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో అన్ని రకాల రుణాలు కనిపిస్తాయి. అందులో ఎంపిక చేసుకోవాలి. అర్హులైన ఎస్సీ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలి.

- రాధిక, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

అట్టహాసంగా జోస్‌అలుక్కాస్ షోరూమ్ ప్రారంభోత్సవం

అనంతలో సందడి చేసిన హీరోయిన్ ఐశ్వర్య రాజేష్



రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభిస్తున్న అతిథులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐశ్వర్య రాజేష్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని సుభాష్ రోడ్డులో జోస్‌అలుక్కాస్ నూతన జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ... ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన జోస్‌అలుకాస్ షోరూంను జిల్లాలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జోస్ అలుకాస్ సంస్థ దేవంలో 100కిపైగా షోరూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. షోరూమ్‌లో రకరకాల జ్యువెలరీ కలెక్షన్లు చూస్తుంటే ఎంతో ముచ్చటగా ఉందన్నారు. జోస్‌అలుకాస్ సంస్థ ఎండీ పాల్ జె అలుకాస్ మాట్లాడుతూ... తక్కువ బరువుతో ఉన్న ప్రపంచస్థాయి డిజైన్లలో సిల్వర్, గోల్డ్, డైమండ్ జ్యువెలరీలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ప్రతి రూ.50వేలు కొనుగోలుపై గోల్డ్‌కాయిన్, 8 గ్రాముల బంగారంపై రూ.2వేలు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుందన్నారు. గతంలో ప్రజలకు బంగారంపై పెద్దగా అవగాహన ఉండేది కాదనీ, ఇపుడు బంగారు ఆభరణాల విక్రయాల్లో చిన్నస్థాయి దుకాణాల నుంచి కార్పొరేట్ సంస్థల వరకు పోటాపోటీని ప్రదర్శిస్తున్నాయన్నారు. ఈ కారణంగా బంగారం ఎక్కడ ఎలా కొనాలనే దానిపై ప్రజలకు అవగాహన ఏర్పడుతోందన్నారు. అనంతరం షోరూమ్ వెలుపల ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ఐశ్వర్య రాజేష్ సినిమా పాటలకు డ్యాన్సులు వేయడంతోపాటు అభిమానులకు అభివాదం చేస్తూ ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో జోస్‌అలుకాస్ షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో గ్లోబల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



భవ్యశ్రీ



షాలిని



యశస్విని



మెర్సిగ్లాండ్



అఫ్కరున్నీసా నహియా



అనూష



శ్రీసాయి

అనంతపురం రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): టీవీ టవర్ సమీపంలోని గ్లోబల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారని కళాశాల డీన్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. జూనియర్ ఎంపీసీలో శ్రావణి, దూదేకుల అనూష, ముక్కర యామిని 464 మార్కులు, తనుశ్రీ, శాలిని 463, మేఘన 462, సుధ 461, వైష్ణవి, తేజస్విణి 460 మార్కులు సాధించారని తెలిపారు. సీనియర్ ఎంపీసీలో అర్పిత 989, భవ్యశ్రీ, స్పందన 988, శివ భార్గవి 987, అఫ్కరున్నీసా నహియా 986, దివ్యశ్రీ, అశ్మిత 985, హారిక 981, సుశ్మిత, ప్రీతి 980 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో షరీఫా 433, యశస్విని, పూజిత 431 మార్కులు, సీనియర్ బైపీసీలో శ్రీసాయి, మెర్సీ గ్లాండ్ 977, యస్వంతి రెడ్డి 976, అనూష 973, కీర్తన 971 మార్కులు సాధించారని తెలిపారు.

కష్టం చేసి బతుకుతున్నా..! ఏనాడూ మాట పడలేదు..

తప్పు ఎవరు చేశారో ఎంక్వైరీ చేయాలి..

అంతేకానీ, వేధిస్తారా..?

ఆత్మహత్యకు ముందు గౌసుల్లా సెల్ఫీ వీడియో



గౌసుల్లా

తాడిపత్రి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీసు స్టేషన్ ముందు రెండ్రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న బంగారం వ్యాపారి గౌసుల్లా మృతిచెందక మునుపు మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తనపై అనవసరంగా నింద మోపి, వేధిస్తున్నారంటూ ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. 'తృప్తి కోసం బంగారు పని చేస్తున్నా. 40 ఏళ్లుగా కష్టపడుతున్నా. ఏనాడూ ఎవరితోనూ మాట పడలేదు. ఎవరైనా వచ్చి తాకట్టు పెట్టిన బంగారం విడిపించి ఇవ్వమంటే అయ్యో.. పాపం.. అని సాయం చేస్తాం. అది దొంగ బంగారం అని ఎలా తెలుస్తుంది? దానిపై ప్రత్యేకంగా ముద్ర ఏమీ ఉండదు కదా. ఎవరో తప్పు చేస్తే నాపై నింద మోపారు. పోలీసులు విచారణ చేయాలే తప్ప.. నాపై దుర్భాషలాడకూడదు. అందరూ దొంగలు ఉండరు. మాట పడనివారు ఉంటారు. నిజాయితీగా బతికే వారూ ఉంటారు. అవేవీ ఆలోచించకుండా అమర్యాదగా మాట్లాడడం బాధ అనిపించింది. పిల్లలు పెద్దవారయ్యారు. వారి ముందే వచ్చి పదేపదే నన్ను విచారణ అంటూ పదే పదే పిలవడం బాధ కలిగించింది. నా పిల్లల కోసం బతుకుతున్నా. వారి కోసం కష్టపడి, న్యాయంగా బతకాలనుకున్నా. దేవుడు ఎక్కడో ఒకచోట ఇస్తాడనుకున్నా. కానీ, ఇలా.. అవమాన పడాల్సి వస్తుందనుకోలేదు.' అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. తాకట్టు బంగారాన్ని కొనుగోలు చేసిన వివాదంలో పోలీసులు, మరికొందరు వేధించడంతో గౌసుల్లా ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆయన వీడియో బయటపడడం చర్చనీయాంశమైంది.

తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ గోల్డ్‌లోన్ కంపెనీలో మహమ్మద్ రఫీ అనే వ్యక్తి పది తులాల బంగారాన్ని తాకట్టుపెట్టి 2023 డిసెంబరులో రుణం తీసుకున్నాడు. దీనికి అదే కంపెనీలో పనిచేస్తున్న అతని స్నేహితుడు జిలాన్‌బాషా సాయం చేశాడు. ఆ తరువాత రఫీకి తెలియకుండా తాకట్టు బంగారాన్ని జిలాన్ బాషా అమ్మేశాడు. 'వేలానికి వచ్చిన బంగారం.. తక్కువ ధరకు ఇప్పిస్తా' అని చెప్పి గౌసుల్లాకు విక్రయించాడు. సరిగ్గా ఏడాది తరువాత తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకునేందుకు జిలాన్ బాషాను రఫీ సంప్రదించాడు. అతను స్పందించకుండా కాలం గడిపి, రెండు నెలల క్రితం ఊరు విడిచి వెళ్లిపోయాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తానే గాలించి, బళ్లారిలో ఉన్న జిలాన్‌బాషాను పట్టుకు వచ్చి రెండు రోజుల క్రితం పోలీసులకు అప్పగించాడు. బంగారాన్ని గౌసుల్లాకు విక్రయించానని జిలాన్‌బాషా చెప్పాడు. దీంతో పోలీసులు.. గౌసుల్లాను పిలిపించారు. వేలంలో అమ్ముతున్నారని జిలాన్ చెప్పడంతో తాను మూడు తులాల బంగారాన్ని కొనుగోలు చేశాననీ, డబ్బు అప్పుడే చెల్లించానని గౌసుల్లా.. పోలీసులకు తెలిపాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా గౌసుల్లాను పోలీసులు స్టేషన్‌కు పిలిపించడం, ఆయన ఇంటి వద్దకు మహమ్మద్ రఫీ, పోలీసులు వెళ్లడం వంటి ఘటనలు జరిగాయి. ఎస్ఐ గౌస్ బాషా శుక్రవారం ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించారు. తాను కొన్నది మూడు తులాలేననీ, డబ్బు కూడా ఇచ్చేశానని గౌసుల్లా చెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. అనంతరం స్టేషన్ బయటకు వెళ్లిన గౌసుల్లా.. తన ద్విచక్రవాహనంలో ఉన్న రసాయనం బాటిల్‌ను తీసుకుని తాగేశాడు. తర్వాత మృతిచెందాడు. పోలీసుల తీరుతో ఆవేదనకు లోనయ్యాడో గౌసుల్లా వీడియోలో వివరించాడు.

17న ఎస్సీ, ఎస్టీ స్పెషల్ గ్రీవెన్స్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల వారి సమస్యలపై ఈనెల 17న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎస్సీ, ఎస్టీ స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ రాధిక శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించే కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ప్రజలు హాజరై, సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని కోరారు.

ఒకేషనల్ కోర్సుల్లో 2,390 మంది ఉత్తీర్ణత

అనంతపురం విద్య, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఒకేషనల్ కోర్సుల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 2,390 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. శనివారం విడుదలైన ఫలితాల్లో ఫస్ట్ ఇయర్‌లో 2311 మందికిగాను 2111 మంది హాజరు కాగా 1100 మంది ఉత్తీర్ణులయ్యారు. 52.11 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కంబదూరు కేజీబీవీలో అత్యధికంగా 97.37శాతం పాస్ కాగా కణేకల్లు జూనియర్ కాలేజీలో ఒకేషనల్ విద్యార్థులూ ఒక్కరూ పాస్ కాలేదు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 1756 మందికిగాను 1665 మంది విద్యార్థులు హాజరుకాగా 1,290 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 77.5 శాతం ఉత్తీర్ణత వచ్చింది. కేజీబీవీ యాడికి, కేజీబీవీ గుత్తిలో 100శాతం విద్యార్థులు పాసయ్యారు. అత్యల్పంగా కణేకల్లు జూనియర్ కాలేజ్‌లో 59.3 శాతం ఉత్తీర్ణత వచ్చింది.

తగ్గిన చీనీ ధర

అనంతపురం రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో చీనీ ధర తగ్గింది. శనివారం రూ.20 వేల దిగువకు పడిపోయింది. మార్కెట్‌కు 1,085 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. టన్ను గరిష్ఠంగా రూ.19,510, కనిష్ఠంగా రూ.2,560, సరాసరి రూ.13వేలు ధర పలికిందన్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు దొంగలు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలంలోని ఆలమూరులో ఒక ఇంటిలో దొంగతనానికి ప్రయత్నించినట్లు గ్రామస్థులు తెలిపారు. అక్కడి నుంచి పరారు కావడంతో గ్రామానికి చెందిన ప్రజలు 21కిలోమీటర్ల దూరంలోని తగరకుంటలో పట్టుకొని అనంతపురం పోలీసులకు అప్పగించారు. వీరంతా రాజస్థాన్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వీరు కారులో వచ్చి దొంగతనాలకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. వీరిని ప్రత్యేక బృందంవారు విచారిస్తున్నట్లు సమాచారం.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్

నార్పల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు మహేష్‌ను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ విలేకరుల సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. వారు తెలిపిన మేరకు బాలిక స్కూల్ నుంచి ఇంటికి వచ్చి ఆడుకుంటుండగా బుక్కరాయసముద్రం మండలం సంజీవపురం గ్రామానికి చెందిన మహేష్ అనే యుకుడు గొర్రెల ఎరువుల కోసం అక్కడికి వెళ్లాడు. ఆ ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఆ బాలిక ఒంటరిగా ఉందని గమనించిన మహేష్ ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బొమ్మలాటపల్లి మిట్ట వద్ద ఉన్నట్లు సీసీ కెమెరాల ద్వారా గమనించి, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇతడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.



అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ



బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 227135

ఉచిత విద్యావకాశాలు

ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing), B.Sc (MLT),BPT (ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి,అనంతపురం సెల్ 9030661651.

AJA- 227134

ఉద్యోగవకాశాలు

SBI లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ నందు 10th,inter పాసై25 సం॥ పైబడిన స్త్రీ, పురుష అభ్యర్థులు అడ్వైసర్లుగా కావలెను నెలకు కనీస ఆదాయం 30000/- ఏదైనా వృత్తి, ఉద్యోగం, వ్యాపారం, చేసుకొనేవారు, గృహిణిలు, రిటైర్డ్ అయినవారు కూడాజాయిన్ అవ్వచ్చు వెంటనే సంప్రదించండి. Cell:90637 91808.

AJA-227141

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను

ATP నందలి షోరూంలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. అర్హత: ఇంటర్ పాస్/ఫెయిల్, వయస్సు: 35సం॥లు లోపు అనుభవం కలవారికి ప్రాధాన్యత. (Local only) Cont:8179290778.

AJA-227136

TOLET

ATP నగరం ఆదిమూర్తి నగర్‌లో కళింగ షాపింగ్ మాల్ ఎదురుగా D.No.10/370 లో డబుల్‌బెడ్ రూం (2BHK,ఫ్యామిలీ పోర్షన్) గల 2 ఇల్లు బాడుగకు కలవు. Cont:9441377933.

AJA- Sathish

గాయత్రి జ్యోతిష్యం

పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, స్త్రీ పురుష వశీకరణ, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర:9440532926

AJA-Sathish

నిరుద్యోగులకు శుభవార్త

అనంతపురం జిల్లాలోని అన్ని మండల, గ్రామ పంచాయతీలలో ఇంటి నంబర్లు వేయడానికి మండలాల వారీగా ఏజెంట్లు కావలెను. Cell:8886868095.

AJA-Krishna



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

రథంపై ఊరేగిన లక్ష్మీనారాయణస్వామి



లక్ష్మీనారాయణస్వామి రథోత్సవం

బుక్కపట్నం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అతి పురాతనమైన లక్ష్మీనారాయణస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయమే స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణలు అర్చకుడు హరిస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మడుగు తేరును హరినామస్మరణ మధ్య కదిలించారు. రథోత్సవం తేరువద్ద నుంచి బ్రాహ్మణ వీధి వరకు లాగారు. సాయంత్రం యథాస్థానానికి చేర్చారు. ఈ రథోత్సవానికి ఉభయదారులుగా జనసేన జిల్లా కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. భక్తులకు బిల్డర్ వెంకటేష్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించడానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు అధికంగా భక్తులు తరలి వచ్చారు.

కదిరి కళాకారులకు కందుకూరి అవార్డు



చల్లా నరసింహులనాయుడు, కేవీ నాగప్ప

కదిరి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కళారంగంలో ప్రతియేటా కళాకారులకు ఇచ్చే ప్రతిష్టాత్మకమైన కందుకూరి అవార్డులకు కదిరికి చెందిన ఇద్దరిని ఎంపిక చేసినట్లు కర్నూలు జిల్లా కేంద్రంలోని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య శనివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, కళాకారుడు చల్లా నరసింహులనాయుడు, కేవీ నాగప్ప కందుకూరి అవార్డులకు ఎంపిక చేశారు. ఈనెల 15న కర్నూలులో అవార్డులు ప్రదానం చే యనున్నట్లు చెప్పారు. నాటక రంగంలో విశేష ప్రతిభ కనబరచిన కళాకారులకు ప్రతియేటా కందుకూరి అవార్డులను కందుకూరి వీరేశలింగం పంతుల జయంతితోపాటు తెలుగు నాటక రంగ దినోత్సవం పురస్కరించుకుని అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కర్నూలు డీఐజీ డాక్టర్ కొయ్య ప్రవీణ్, మాజీ మంత్రి టీజీ వెంకటేష్, అరుణ భారతి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజారెడ్డి, ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన

నల్లమాడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆర్పీపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లె గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు పన్నుల భారం వేయబోమని ప్రకటిస్తూనే గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ నడ్డివిరుస్తున్నారని విమర్శించారు. అనంతరం ద్విచక్రవాహన టైర్లను దగ్ధం చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, వెంకటయ్య, సుధాకర్, ముత్యాలు, రాజు పాల్గొన్నారు.

వైసీపీ మండల కన్వీనర్‌గా లక్ష్మీపతిరెడ్డి



ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్‌గా కుసుమవారిపల్లికి చెందిన కుప్పన్నగారి లక్ష్మీపతిరెడ్డిని ఎంపిక చేసినట్లు పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో కార్యకర్తలు, నాయకుల అభిప్రాయం మేరకు సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీపతిరెడ్డిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

ముదిగుబ్బ, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరేళ్ల బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించాడని వృద్ధుడిపై శనివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపారు. బాలిక ఆరుబయట ఆడుకుంటుండగా ఎవరూ లేని సమయంలో 65 ఏళ్ల వృద్ధుడు బాలికను పక్కకు తీసుకువెళ్ళి అ సభ్యకరంగా ప్రవర్తించాడని, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బసవపున్నయ్యకు ఘన నివాళి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం మాకినేని బసవపున్నయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన కీలకంగా పనిచేశారని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో ప్రముఖ పాత్ర వహించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్, ముస్తాక్, రామమోహన్, బాబ్‌జాన్, ఆంజనేయులు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చైతన్య సదస్సును విజయవంతం చేయండి

ధర్మవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ సాధన కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులో నిర్వహించే ప్రాంతీయ చైతన్య సదస్సును విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. ఈ మేరకు స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. వెంటనే 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఆలస్యమయ్యేపక్షంలో ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణనాయక్, హరికృష్ణ, రామాంజనేయులు, హరిశంకర్, ఆంజనేయులు, ప్రదీప్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శనివారం హనుజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చౌడంపల్లి కోదండరామాలయంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో అర్చకులు విజయసింహ ప్రత్యేక పూజలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో పురోహితులు తోయ్యరాజు ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

● ధర్మవరంరూరల్ : మండలంలోని గరుడంపల్లి వద్ద ఉన్న కొండారుపల్లి ఆంజనేయస్వామి దేవాలయంలో హనుజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి ఆకుపూజతో విశేషపూజ లు చేశారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.



చౌడంపల్లి, కొండారుపల్లి ప్రత్యేక పూజలు

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల సత్తా



బి.శ్రావణి(ఎంపీసీ), ఝాన్సీ (ఎంపీసీ), దివ్యశ్రీ (ఎంపీసీ), జయంత్‌నాయక్ (ఎంపీసీ), ఘర్షిత (బైపీసీ), నందిని (సీఈసీ), వి. అమృత (949), షమీర్ (937), నూర్‌మహమ్మద్ (940), షబిహ (906)

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): **ఇంటర్మీడియట్ ఫలితాలను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు సత్తాచాటారు.** పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి ఆదర్శపాఠశాలలో మిశ్రమఫలితాలు వెల్లడయ్యాయి. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 76 మంది పరీక్షలు రాయగా 26 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 54 మంది పరీక్షలు రాయగా 37 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ప్రథమ సంవత్సరం ఎంపీసీలో బి.శ్రావణి 443, ఝాన్సీ 424, దివ్యశ్రీ 420 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో జయంత్‌నాయక్ 932, బైపీసీలో ఘర్షిత 911, నందినీబాయి 910 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ రమేష్‌బాబు పేర్కొన్నారు. జగరాజుపల్లి మంగళకర కళాశాలలో విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ప్రథమ సంవత్సరంలో 324 మంది పరీక్షలు రాయగా 221 మంది, ద్వితీయ సంవత్సరంలో 365 మంది పరీక్షలు రాయగా 302 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ సురేష్‌కుమార్, ఎక్స్‌క్యూటివ్ ట్రస్టీ ఆర్యప్రకాష్ పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో నాగలక్ష్మి 463 మార్కులు, గీతిక 461, సుమిత్ర 459, సుస్మిత 458, సౌమ్య 457, తేజస్విణి 454 మార్కులు, బైపీసీలో సోఫియా 420 మార్కులు, నవ్యశ్రీ 419, కావ్యశ్రీ 418, ఎంఈసీలో చంద్రకళ 458 సీఈసీలో ధ్యాన్‌చంద్ 431, హరిప్రసాద్ 430 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో తౌఫీక్ 978 మార్కులు, ధనుష్ 975, కార్తీక్‌రెడ్డి 962, బైపీసీలో రక్షిత 956, శశికళ 939, సీఈసీలో సాయిదీపిక 941 మార్కులు సాధించారు.

● **ఓబుళదేవరచెరువు :** అమడగూరు ప్రభుత్వ ఆదర్శ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు సత్తా చాటారు. ఆదర్శ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీ చదువుతున్న అమృత 1000 మార్కులకు 949 మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణత సాధించారు. 49 మందికిగాను 47 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం 85 మంది విద్యార్థులకు గాను 64 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో నూర్‌మహమ్మద్ 940 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. బైపీసీలో షమీర్ 937 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, షబిహ 906 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో చంద్రహాసన్ ఎంపీసీ 414, యమున బైపీపీ 385, రాజుకుమార్ హెచ్ఈసీ 433 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. కస్తూరిబా పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో పూజిత 390, యామని 362, వాసవి 350, ద్వితీయ సంవత్సరంలో గీతా 892, రక్షిత 863, భవాని 861 మార్కులు సాధించినట్లు ఎస్ఓ తెలిపారు.

● **నల్లమాడ :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 75 మంది పరీక్షలు రాగా 15 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం 71మంది రాయగా 45 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ తెలిపారు. ద్వితీయ సంవత్సవరం అరవింద ఎంపీసీ 864 మార్కులు, సౌమ్య బైసీపీ 811, మొదటి సంవత్సరం ఎం.నవన్ ఎంపీసీ 420, మనీషా ఎంపీసీ 388 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

● **తనకల్లు :** మండల కేంద్రంలోని శ్రీగోవిందు నరసింహారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 91.5 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ చెన్నకేశవ ప్రసాద్ తెలిపారు. 83 మంది విద్యార్థులకు గాను 76 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. మొదటి సంవత్సరంలో 126 మందికిగాను 71 మంది ఉత్తీర్ణతతో 56.3 శాతం సాధించామన్నారు. ద్వితీయ సంవత్సరంలో కళాశాల టాపర్‌గా ఉస్మాన్‌గణీ సీఈసీ 940, సుబేరా బైపీసీ 926, మహమ్మద్‌జునైద్ ఎంపీసీ 887 మార్కులు సాధించినట్లు చెప్పారు. ప్రథమ సంవత్సరంలో ప్రత్యూష బైపీసీ 424, చంద్రశేఖర్ సిరికల్చర్ 461, జ్యోతి సిరికల్చర్ 460, మహీర్ ఎంపీసీ 427 మార్కులు సాధించినట్లు తెలిపారు. తనకల్లులోని కేజీబీవీలో మొదటి సంవత్సరం బైసీపీలో 82 శాతం, ద్వితీయ సంవత్సరం ఎంఈసీ 99శాతం బాలికలు ఉత్తీర్ణులైనట్లు ఎస్ఓ హమీదాబీ తెలిపారు.

● **నంబులపూలకుంట :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో సీఈసీలో మొదటి సంవత్సరం 20 మందికి ఐదుగు రు ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరం 20 మందికి ఆరుగురు ఉత్తీర్ణులైనట్లు ఎస్ఓ రిహానా తెలిపారు.

● **తాడిమర్రి :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 57 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరుకాగా 30 మంది ఉత్తీర్ణులైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 26 మందికిగాను 20 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో సబీహా(900), షరీన్‌తాజ్(789) సాధించినట్లు తెలిపారు.

● **ముదిగుబ్బ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం మణికంఠ నాయక్ (ఎంపీసీ)347, నందిని 334 కళాశాలలో మొదటి, ద్వితీయ స్థానాలలో మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం షణ్ముఖ 902, నందిని 896 కళాశాలలో మొదటి, ద్వితీయ స్థానాలలో మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ రామరాజు తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్‌డీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం నిఖిలేశ్వరి (బైపీసీ) 945, ఆయిషా రిజ్వానా (సీఈసీ) 690 కళాశాలలో మెదటి, ద్వితీయ స్థానాలలో మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

ఘనంగా చెన్నకేశవుడి రథోత్సవం



తేరు లాగుతున్న భక్తులు (ఇన్‌సెట్‌లో), కొలువుతీరిన ఉత్సవ మూర్తులు

తాడిమర్రి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా జరుగుతున్న చెన్నకేశవస్వామి ఉత్సవాలలో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీతారమ చెన్నకేశవస్వామికి శనివారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనాల నడుమ ఉదయం గణపతిహోమం నిర్వహించి అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులను, మూలవిరాట్‌లను అందంగా అలంకరించారు. పూజా కార్యక్రమాల బలిహారతి అనంతరం మడుగు తేరు కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుమునుపు స్వామివారు రథంలో కొలువు తీరగా పురోహితులు సంతోష్‌శర్మ పూజలు నిర్వహించి వారం రోజులుగా కార్యకమాల్లో పాల్గొంటున్న వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అక్కడి నుంచి వాసవీమాత ఆలయం వరకు మడుగు తేరు లాగారు. సాయంత్రం తిరిగి రథాన్ని గ్రామమంతా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపు సందర్భంగా నిర్వహించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పూజా కార్యక్రమాలలో మండల ప్రజలతో పాటు టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, నాయకులు సాయి, హర్షవర్దన్, మల్లి,రామ్మోహన్, పక్కీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడుపోటీలు: ఆలయ సమీపంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలను తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. విజేతలుగా నిలిచిన యాడికి మండలానికి చెందిన వాసుదేవరెడ్డికి రూ.70వేలు, సోమలదొడ్డి రామసుబ్బారెడ్డికి రూ.50వేలు, నంద్యాల నాగరాజామాదవ్‌కు రూ.30వేలునగదును అందజేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన తోఫిక్, సతీష్‌నాయక్

నల్లమాడ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరవవాండ్లపల్లి సమీపంలో బొలోరో, ద్విచక్రవాహనం శనివారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కదిరి నుంచి నల్లమాడ మీదుగా పుట్టపర్తికి ద్విచక్ర వాహనంలో తోఫిక్, సతీష్‌నాయక్ వెళుతున్నారు. పుట్టపర్తి నుంచి బొలోరోలో డ్రైవర్ శేషు కర్బూజా కాయలు వేసుకుని నల్లమాడకు వస్తుండగా అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తోఫిక్ రెండుకాళ్లు, సతీష్‌నాయక్‌కు ఒక కాలు విరగ్గా, శేషుకు చెయ్యి విరిగింది. స్థానికుల సమాచారం మేరకు 108 ద్వారా నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. మెరుగైన చికిత్సల కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ప్రమాదంలో బాలాజీనాయక్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎద్దువాలండ్లపల్లికి చెందిన బాలాజీనాయక్ కొండకమర్ల నుంచి ద్విచక్రవానంలో వస్తుండగా చౌటకుంటపల్లి మిట్టపైన బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పి పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దుచేయాలని నిరాహారదీక్ష

ధర్మవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌సవరణ బిల్లు రద్దుచేయాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ముస్లింలు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సీఐటీయూ మండల కన్వీనర్ జేవీరమణ, కో కన్వీనర్లు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, హైదర్‌వలీ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ముస్లింలు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్న ఆలోచనతో వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన జీఓను పార్లమెంట్‌లోకి తీసుకుని రావడంజరిగిందన్నారు. అనేక సంవత్సరాలుగా తమ ఆస్తులను కాపాడుకుంటూ ఖబరస్తాన్, మసీదులు, ఈద్గాలు, మద్రాసాలు అభివృద్ధి కోసం ఉపయోగించుకుంటున్నారన్నారు. కేంద్రంలో అధికారంలోకి ఉన్న బీజేపీ ఆస్తులను వారికి లేకుండా చేయాలనే ఆలోచనలతో ముస్లీం మైనార్టీలకు చెందిన వక్ఫ్ క మిటీలలో అన్యమతస్తులకు ప్రవేశం కల్పించే విధంగా జీవోలు తీసుకుని వస్తున్నారన్నారు. వక్ఫ్ ఆస్తులను కాపాడుకునేందుకు దీక్షలు చేపడుతున్నామన్నారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన జీఓలను వెంటనే రద్దుచేయాలన్నారు.

ఫాదర్ ఫెర్రర్ సేవలు మరువ లేనివి

బత్తలపల్లి ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు ఫాదర్ విన్‌సెట్ ఫెర్రర్ చేసిన సేవలు మరువలేనివని ఆర్‌డీటీ మహిళా డైరెక్టర్ విశాల ఫెర్రర్ తెలిపారు. మండల పరిధిలోని మాల్యవంతం గ్రామంలో శనివారం ఆర్‌డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ ఫెర్రర్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలోనే కరువు జిల్లాగా పేరు పొందిన అనంతలో ఫాదర్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమమంలో ఆర్‌డీ ప్రమీల, ఏటీఎల్ క్రిష్ణ పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ ఊరేగింపు

తనకల్లు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరాకువాండ్లపల్లి వద్ద ఉన్న కట్టకింద గంగమ్మ ఊరేగింపు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఊరేగించి, ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఇంటి వద్ద కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చారు.

వైభంగా శ్రీగిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షణలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): సత్యసాయి గిరిప్రదక్షణను భక్తులు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి 7 గంటల సమయంలో ప్రశాంతినిలయం గణేశ్‌గేటు వద్ద సత్యసాయి రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరంసత్యసాయిరథాన్ని లాగుతూ భక్తిపాటలు పాడుతూ గిరిప్రదక్షణ నిర్వహించారు. మంగళహారతితో గిరి ప్రదక్షణ నిర్వహించారు. వృద్ధులు సైతం గిరిప్రదక్షణలో పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

గాండ్లపెంట, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): యువతి ఆదృశ్యంపై కేసు నమోదుచేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ శనివారం తెలిపారు. మండలపరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి శుక్రవారం నుంచి అదృశ్యమైనట్లు తండ్రి ఫిర్యాదు చేశారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మాజీమంత్రి పల్లెపై ఆరోపణలు అవాస్తవం

బుక్కపట్నం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిపై చేసిన ఆరోపణలు అవాస్తమని మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాలపురం గంగాధర్ ఖండించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాల రాజకీయ చరిత్రలో మచ్చలేని నాయకుడు పల్లె రఘునాథరెడ్డి అన్నారు. అలాంటి నాయకుడిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అవినీతి ఆరోపణలు నిరూపించాలి, లేకుంటే దీటుగా సమాధానంచెబుతామని హెచ్చరించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

ముదిగుబ్బ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మలకవేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. వాక్సీన్ రూమ్, లేబర్ రూమ్, వార్డు, ఓపీ రూమ్, ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నాగేంద్ర నాయక్, రోజా, ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సస్పెండ్ అయిన ఆర్ఐపై ఫిర్యాదు

కదిరి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల వివిధ కేసుల్లో నిందితుగా ఉండి, సస్పెండ్ అయిన ఆర్ఐపై కానిస్టేబుల్ గోవర్ధన్ శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పలు కేసుల్లో నిందితుడిగా ఉండి, సస్పెండ్ అయిన ఆర్ఐ మున్వీర్‌హుస్సేన్ గత నెల 24న పోలీస్ స్టేషన్‌కు వచ్చే సమయంలో తన వెంట వాయిస్ రికార్డులు తెచ్చుకుని పోలీసులపై రెచ్చగొట్టే విధంగా చేసి.. ఆ మాటలను వక్రీకరించి రికార్డులు చేశారు. శనివారం వారి మాటలను వక్రీకరించి కల్పిత మాటలతో సోషల్ మీడియాలో పెట్టి శాంతి భద్రతకు విఘాతం కల్పించాడని తెలిపారు. సీఐ నారాయణరెడ్డిపైన, కానిస్టేబుల్ గోవర్ధన్‌ను బెదిరించడంపై ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

32 వ్యవసాయ బోర్ల వైరు చోరీ

బత్తలపల్లి ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లబోయనపల్లి వద్ద 32 వ్యవసాయబోర్ల వైరు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 32 వ్యసాయ బోర్లకు సంబంధించిన మోటరు స్టాటర్లకు ఉన్న వైరుర్లను దొంగలించినట్లు రైతులు తెలిపారు. ఈ నెల 7న ఇదే బోర్ల వైరు దొంగలించారు.

పాలిసెట్ ఉచిత మెటీరియల్ పంపిణీ

ధర్మవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ ఉచిత మెటీరియల్స్‌ను బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నతపాఠశాల హెచ్ఎం రాంప్రసాద్ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హర్షవర్ధన్, ఇన్‌చార్జ్ రమేశ్, నాగరాజు, శిరీష పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రైవేటు విద్యార్థుల హవా



వర్షిత(987), సానియా(986), అఖిల(985), శాంతియా(987), దివ్య(984), దీక్షిత(465), వర్ష(465), దీపిక(433), రుక్షితాబాయి(487), చరణ్‌తేజారెడ్డి(465), హరీశ్(982), గాయత్రి(974),గీత(969)

ధర్మవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ ఫలితాల్లో ధర్మవరం పట్టణంలోని ప్రైవేటు కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. శ్రీవాసవి కళాశాలకు చెందిన సీనియర్ ఎంపీసీ విభాగంలో వర్షిత(987), సానియా(986), కీర్తన(986), అఖిల(985), సుప్రియ (985), సిరి(985),సౌమ్య(984), గౌతమి(984), తస్లీమాన్రసీన్(983), యామిని(983), మానస(983), అర్చన(983), జాహ్నవి(983), శ్రీవిద్య(982), సాయిహాసిని(982), మహబూబ(981), జీఎస్ హస్న(980) మార్కులు సాధించారు. సీనియర్ బైపీసీలో శాంతియ(987), దివ్య(984), కీర్తి(983) మార్కులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్లు ఈశ్వరయ్య, భాస్కర్‌రెడ్డి, శివశంకర్ తెలిపారు. జూనియర్ ఎంపీసీలో దీక్షిత ((465), వర్ష(465), కీర్తి(464), జానకి(464), హిరణ్మై (464), నాగనవ్య(464), సాయిప్రవల్లిక(464), సమీరా(464), పరియాజ్(463), చరిత(463), రాజ్యలక్ష్మీ (461)మార్కులు సాధించారు. జూనియర్ బైపీసీలో దీపిక(433), అక్షయ(431), కీర్తన(431), లేఖ్యవర్ధిని(427), కల్పన(427)మార్కులు సాధించారు. జూనియర్ ఎంఈసీలో ఫర్హానా (485), జూనియర్ సీఈసీలో రుచితాబాయి(487), మౌనిక(484), సుమలత (483), భువన(480), రూప(474), నవ్యకళ(471), నందిత(465), రాకీబసుల్తాన(460) మార్కులు సాధించారని అన్నారు. వీరిని కళాశాల డైరెక్టర్లు ఈశ్వరయ్య, భాస్కర్‌రెడ్డి, శివశంకర్ అభినందించారు.



సాయికృపా జూనియర్ కళాశాలలో సంబరాలు

సాయి కృప జూనియర్ కళాశాలలో..

ఇంటర్‌ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్టు కరస్పాండెంట్ కృష్ణతేజ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో వేమంత్(987), నితిన్‌సాయికుమార్‌రెడ్డి(987), హేమంత్(983), వినోద్(982),అయేషా (978), శ్వేతా(978), మంజునాథ్(976), సర్ఫరాజ్(972), తస్లీమ్(971), యశ్వంత్(960), ఫయాజ్ (960), మహమ్మద్ షరీఫ్(955) మార్కులు సాధించారు. ద్వితీయసంవత్సరం సీఈసీ విభాగంలో రవి(957), వెన్నెల(953), ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో యమున(906) మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బాలాజీ (463), పార్థసారధి(462), భరత్‌కిశోర్(462), వినయ్(460), సౌజన్‌కుమార్(459), ఆర్పిత(459), ఆదిత్య(459), శిరీష(457), గౌతమ్(455), తేజాస్వరూప్(454), రవితేజ(450) మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం సీఈసీ విభాగంలో నేహ(452), నందిని(443), హర్షన్‌కుమార్(414) మార్కులు సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ కృష్ణతేజ, డైరెక్టర్లు భగవంతరెడ్డి, పురుషోత్తంరెడ్డి, డోలాపెద్దిరెడ్డి, చంద్రశేఖర్, చాంద్‌బాషా, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

సీతారామయ్యబాలికల జూనియర్‌కళాశాలలో..



మాధవి(973), గుణశ్రీ(421), హేమలత(446)

పట్టణంలోని సీతారామయ్య బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్‌ఫలితాల్లో సత్తాచాటారని కళాశాల కరస్పాండెంట్ సీతారామయ్య తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో గాయత్రి(974),గీత(969), కీర్తన(968), సీఈసీలో మాధవి(973), శృతి తనయ(959) మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో హేమలత(446), అఫ్రీన్‌తాజ్(442), బైపీసీలో గుణశ్రీ(421), పరిమళ(420), సీఈసీలో సుహిత(480), వైష్ణవి(471) మార్కులు సాధించారని అన్నారు. వీరిని కరస్పాండెంట్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

న్యూస్ బాక్స్


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కనులపండువగా సీతాకల్యాణం

గోరంట్ల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం శనివారం కన్నులపండుగలా జరిగింది. ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా ఈనెల 6నుంచి 15వరకు నవరాత్రి ఉత్సవాలను అర్చకులు వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆలయం ముందు ఆరుబయట పచ్చని పందిరిలో సీతారాముల వివాహ వేడుకను ఏర్పాటు చేశారు. సంప్రదాయ రీతిలో పెళ్లి తంతు ఆచరించడం భక్తులను ఆకట్టుకుంది. ఆలయంలోని మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు.

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి పండగ వేడుకల్లో భాగంగా రామబురుజు కోటగోడ వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం అర్చకులు ప్రసాద్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రాత్రి వేదబ్రహ్మ పంచాంగం నాగప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు మెహర్‌బాబా పాల్గొన్నారు.


రామబురుజు కోటగోడ వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం

ముగిసిన నిడిమామిడమ్మ ఉత్సవాలు

మడకశిర రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నిడిమామిడమ్మదేవి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణచేసి పూజలు నిర్వహించారు. అభిషేకాలు, చండీహోమం, పూర్ణాహుతి, మహా కుంభాబిషేకం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే చర్యలు: ఈఓ

సోమందేపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఆలయ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఈఓ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గుడిపల్లి గ్రామం సజ్జగంట రంగనాథస్వామి ఆలయానికి సంబంధించిన కోనేరు స్థలాన్ని గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి కుటుంబం ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నించిన నేపథ్యంలో గ్రామస్థుల అభ్యర్థన మేరకు ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఉంచారు. అయితే మంగళవారం రాత్రి ఆ బోర్డును తొలగించడంతో వివాదం నెలకొంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా విచ్చేసిన ఈఓ ఈశ్వర్‌రెడ్డికి గ్రామస్థులు ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ కోనేరుకు సంబంధించిన 83సెంట్లులో ఒక సెంటు ఆక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరికలు జారీచేశారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం తిరిగి ఆ స్థలంలో బోర్డులను గ్రామస్థులతో ఏర్పాటు చేయించారు.

వైభవంగా రథోత్సవం

సోమందేపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లి గ్రామంలో శనివారం సజ్జగంట రంగనాథస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తులతో వీధులు జనసంద్రమయ్యాయి. రథం లాగుతున్న సందర్భంలో గోవిందనామస్మరణతో వీధులు మార్మోగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రథం వద్ద అడుగడుగునా స్వామివారి నామాన్ని ఉచ్చరిస్తూ పూజలు నిర్వహించారు. ప్రాచీన ఆలయంలో వెలసిన మూలవిరాట్‌ను దర్శించుకుంటే సాక్షాత్తు తిరుపతి వెంకన్నను దర్శించుకున్న పుణ్యం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సకలపాపాలు హరించిపోతాయని భక్తులు నమ్మకం. ప్రతియేటా పదిరోజులపాటు ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని ధర్మకర్త రమాకాంతరెడ్డి తెలిపారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయంలో ఉదయం రథోత్సవం సందర్భంగా పంచామృతాభిషేకం, నిత్య హోమాలు జరిగాయి. నిత్య పరిహరణం, రథాంగహోమం, యాత్రదానం జరిగినట్లు వేద పండితులు మధుసూదన్, సత్యనారాయణమూర్తి తెలిపారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు

అగళి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని హళ్లికెర గ్రామంలో వెలసిన వీరముత్తప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. 14న సోమవారం గంగపూజ, జలధి మహోత్సవం ఉంటుందని, 15న దేవనహళ్లి కంకణ కలశ స్థాపన, పంచామృతాభిషేకం అంకురార్పణ, యాగం, మండప ప్రవేశం, గణపతిహోమం, మహామంగళహారతి కార్యక్రమాలు, 16న యోగా సారాధన నవగ్రహ పూజ, గణపతిపూజ, నవగ్రహ హోమం ధ్వజస్థాపన, 17న యోగాసారాధన, మూర్తి జపం, మూర్తి హోమం, మహాస్థాపన, నాగహోమం, 18న శుక్రవారం యోగారాధన స్వామి ప్రతిష్టాపన, పుష్పాభిషేకం, తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ తెలిపింది. కర్ణాటకకు చెందిన ఇల్లైరాంపురం హనుమంతస్వామీజీ ఆధ్వర్యంలో పూజలను నిర్వహించనున్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆటో విషయంలో ఘర్షణ... ఇద్దరికి గాయాలు

గోరంట్ల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూడిదగడ్డపల్లి ఎస్సీకాలనీకి చెందిన రెండు కుటుంబాల మధ్య ఆటో విషయంపై జరిగిన ఘర్షణలో జయప్ప, వెంకటశివప్ప శనివారం తీవ్రంగా గాయపడ్డారు. జయప్ప ఆటో కొనుగోలు చేయడం కోసం శుక్రవారం ప్రతాప్‌తో కలిసి హిందూపురం వెళ్లి కొనుగోలు చేశారు. బాడుగ చెల్లించాలంటూ ప్రతాప్ జయప్పతో శనివారం గొడవపడ్డారు. ప్రతాప్ కొడవలితో అన్నదమ్ములైన జయప్ప, వెంకటశివప్పలపై దాడిచేసి చేశాడు. వారిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్సలకోసం 108లో హిందూపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేగంగా నీటితొట్టెల నిర్మాణాలు

వేసవిలో పశువులు నీటి కోసం ఇబ్బంది పడకుండా చర్యలు

ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

మడకశిర రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం నీటితొట్టెల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. జాతీయ ఉపాధి హామీ పథకం కింద నియోజకవర్గవ్యాప్తంగా ఐదు మండలాలకు గాను 280 నీటి తొట్టెలను రూ.9.30 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టారు. ఒక్కొక్క నీటి తొట్టె నిర్మాణానికి రూ.33,220 కేటాయించారు. మడకశిర మండలానికి 113 తొట్టెలు. రొళ్లకు 66, అమరాపురం 39, అగళి 52 గుడిబండ 10 చొప్పున మంజూరయ్యాయి. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు యూ రంగాపురం గ్రామంలో పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ చేశారు. పనులు కూడా వేగవంతగా జరుగుతున్నాయి. పశువులకు నీరు తాగడానికి అనువైన ప్రదేశాలను గుర్తించి ఈ నీటి తొట్టెలను నిర్మిస్తున్నారు. తొట్టెలు నిర్మించిన అనంతరం సమీప బోరు నుంచి పైపులైను అమర్చి కొళాయిల ద్వారా తొట్టెలను నింపనున్నారు.


నీటి తొట్టెలకు నీరు వదులుతున్న దృశ్యం

వైసీపీ పాలనలో పశువుల తొట్టెలను పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పశువులు నీటి కోసం ఇబ్బందిపడకుండా నీటి తొట్టెల నిర్మించి నీరందించేందుకు చర్యలు చేపట్టింది.



రైతుల బాధలను గుర్తించిన ప్రభుత్వం

వేసవి కాలంలో పశువులకు నీరు అందించాలంటే రైతులు పడే బాధలు అన్నీఇన్నీకావు. ఈ బాధలను ప్రభుత్వం గుర్తించడం ఎంతో సంతోషం. గతంలోను టీటీడీ ప్రభుత్వం నీటి తొట్టెలను నిర్మించింది వాటిలో కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటికి కూడా వైసీపీ పాలనలో మరమ్మతులు చేయలేకపోయారు.

- రంగారెడ్డి, రైతు, సీ కొడిగేపల్లి

త్వరలో పనులు పూర్తి

ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పశువుల నీటి తొట్టె పనులు వేగంగా జరుగు తున్నాయి. కొన్ని చోట్ల పూర్తి కావస్తున్నాయి. మరికొన్నిచోట్ల నిర్మాణాలకు మార్కింగ్ చేస్తున్నాం. పనులు వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

-శ్రీకాంత్ గౌడ్, ఏపీఓ

సత్తాచాటిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు

ఇంటర్ ఫలితాల్లో ప్రైవేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. మంచి మార్కులు సాధించారు.

గోరంట్లలోని కేజీబీవీ విద్యార్థులు ద్వితీయ ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా గుడిబండ ఎంజీపీ విద్యార్థులు

వందశాతం సాధించగా రొళ్ల మండలం ఆవనికుంట గ్రామంలోని కస్తూర్బా కళాశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

హిందూపురంలో...


చందనప్రియ సీమసాధియా సుగంధిరెడ్డి

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం జనరల్ గ్రూపులో 163 మంది పరీక్షలు రాయగా 97 పాస్ అయ్యారు. 60 ఉత్తీర్ణ శాతం సాధించారు. ఒకేషనల్‌లో 154 మందికి 99 మంది పాస్ అయి 64.2 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ గ్రూప్‌లో 128 మంది పరీక్షలు రాయగా 105 మంది పాస్ అయి 82 ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ గ్రూప్‌లో 103 మంది పరీక్షలు రాయగా 91 మంది ఉత్తీర్ణత సాధించి 88.3 శాతం సాధించారు. లిబా సింధోస్ బైపీసీలో 955 మార్కులు, అఫ్సాన 954 మార్కులు, సోనియా 913 మార్కులు సాధించారు. నారాయణ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థిని అతికా ఖనమ్ 466 సాధించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మన్ ఏజీఎం కేశవరెడ్డి, డీన్ శ్రీనివాసరెడ్డి, కోర్ డీన్ బద్రినాథ్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో (988/1000)తో సుగంధి రెడ్డి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో హిందూపురం ఎల్ఆర్‌జీ ఎంపీసీ విభాగానికి చెందిన విద్యార్థిని కె. ఎస్. చందన ప్రియ 990 మార్కులు సాధించింది. రంగస్వామి 988, సాయి ప్రణతి 988 మార్కులు సాధించగా బైపీసీకి సంబంధించి ఆర్ తనుష 987 మార్కులతో ప్రతిభ కనబరిచారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి ఎంపీసీలో కె. మనోజ్ 470 మార్కులకు గాను 462 మార్కులు సాధించాడు. చంద్రచేతన బైపీసీలో 436/440, సాయిదర్శన్ ఎంఈసీలో 489/500, అంజుమ్ నిహత్ 485/500 మార్కులు సాధించారు. అదే విధంగా బాలయేసు కళాశాలకు చెందిన ఎంపిసి విద్యార్థిని సీమా సాధియ 988/1000 సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. సువర్ణభారతి జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో నిహారిక 987/1000, రాంచరణ్ 985/1000, బైపీసీలో చంద్రకళ 982/1000, ఎంఈసీలో మైత్రి 974/1000 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగానికి చెందిన అనుష 464/470, రోతిక 463/470, పల్లవి 463/470, బైపీసీలో బి, అక్షిత 435/440, శైలజ 433/440, సీఈసీ విభాగంలో కె.ఎన్ చందన 487/500, నిత్యమహాలస 483/500, ఎంఈసీ విభాగంలో జయంతి 469/500, మహిమ 465/500 మార్కులు సాధించారు.

పెనుకొండలో..


అఖిల సార్య అఫ్రీన్ తాజ్ అంజుంభాను అజయ్ మౌనిక
సౌమ్య జాహ్నవి అఖిల భవ్య సౌజన్య

పెనుకొండ, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారు. స్థానిక సత్యసాయి జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 109కిగాను 80మంది 70శాతం ప్రథమ సంవత్సరంలో 140మందికి గాను 103మంది 71శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ గంగాధర్, ఏఓ కేశవయ్య తెలిపారు. అఖిలసార్య 952, అఫ్రీన్‌తాజ్ 936, అంజుమ్ బాను 927, ద్వితీయ సంవత్సరంలో అనీస్‌అబ్బాస్ 444, అమూల్య 442, చరణ్ 430 మార్కులు సాధించారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 328కిగాను 130మంది ఉత్తీర్ణత సాధించారని, ద్వితీయ సంవత్సరంలో 202మందికిగాను 153మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సుదర్శన్ తెలిపారు. మహేష్ ఎంఎల్‌టి 492, వర్షిత ఈఎస్ఈ 487, అజయ్ సెకెండ్ సీఎస్ఈ 984, మౌనిక సెకెండ్ ఎంఎల్‌డి 977, పవన్‌కుమార్ ఎంపీసీ 444, సౌమ్య సెకెండ్ బైపిసి 917, నీతు పీఈసీ 425, జాహ్నవి సెకెండ్ ఎంపీసీ 916 మార్కులతో ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీలో వందశాతం, రెండో సంవత్సరం ఎంపీసీలో 82శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జ్యోతిర్లత తెలిపారు. రెండో సంవత్సరం మ్యాథ్స్ భవ్య 870, సీఈసీ గ్రూపులో సౌజన్య 667, మొదటి సంవత్సరం అఖిల 416మార్కులు, హుమిన్ 406, అజయ్ 403 మార్కులు సాధించడం జరిగిందన్నారు.

మడకశిర విద్యార్థుల ప్రతిభ


వేదశ్రీ సంధ్య స్వర్ణలత కావ్య సంతోష్

మడకశిరటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మడకశిర కేజీబీవీ పాఠశాలలో మొదటి సంవత్సరం బైపీసీలో 25 మందికిగాను 16 మంది, ద్వితీయ సంవత్సరం బైపీసీలో 25 మందికిగాను 24 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చాందిని తెలిపారు. కేజీబీవీ పాఠశాల ద్వితీయ సంవత్సరంలో వేదశ్రీ 941/ 1000 మార్కులు, సంధ్య 851/1000 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం బైపీసీలో జి.రక్షితకు 414/440 మార్కులు, చిట్టెమ్మ 412/440 మొదటి, ద్వితీయ స్థానంలో నిలిచారు. వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో స్వర్ణలత 984/ 1000 మార్కులు సాధించారు. ఆర్.కావ్య 983/ 1000మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి తెలిపారు. బైపీసీలో ఆర్. సంతోష్‌కు 964/1000 మార్కులు, సీ ఈసీలో 952/ 1000 మా ర్కులు సాధించారు. కళాశాలలో వందశాతం ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. అదేవిధంగా జూనియర్ బైపీసీలో నిఖిత 430/440 మార్కులు, మధుమతి 429/440, వర్షిత 429/440 మార్కులు సాధించినట్లు తెలిపారు.

తగ్గిన ఉత్తీర్ణత శాతం

లేపాక్షి, (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో లేపాక్షి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం తగ్గింది. మొదటి సంవత్సరం 73మంది పరీక్షలు రాయగా కేవలం 21మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 50 మంది రాయగా 39 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరం బైపీసీలో 25 మంది పరీక్ష రాయగా వందశాతం ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ మహబూబ్‌బాష తెలిపారు. కాగా బైపీసీ విద్యార్థిని సమీర 866/1000 మార్కులు, రుబానా బాను 835 మార్కులు సాధించారు.


అగళిలో...

అగళి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 69మంది వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకెండియర్‌లో 70మందికిగాను 30మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ జాఫర్ తెలిపారు. కస్తూర్బా పాఠశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యు మొదటి సంవత్సరం 34మందికి 31మంది పాసయ్యారు. సెకెండియర్‌లో 24కు 21మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్ఓ నాగరత్నమ్మ తెలిపారు. కావ్య 925మార్కులు, వర్ష 909, హేమశ్రీ 801 మార్కులు సాధించినట్లు తెలిపారు. గుప్త కళాశాలలో సెకెండియర్ 80శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రఘురాం తెలిపారు. మొదటి సంవత్సరంలో 52శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

అమరాపురంలో...

అమరాపురం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ చదువుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ఎంపీసీలో సంగీత (1000/966), బైపీసీలో కె.అక్షయ (1000/966) మార్కులు, సీఈసీలో కె.మానస (1000/927) మార్కులు, హెచ్ఈసీలో వి.నాగమణి (1000/799) మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. అమరాపురం ఆదర్శ జూనియర్ కళాశాలలో సీఈసీలో ఎం.మౌనిక (1000/929)మార్కులు, ఎంపీసీలో ఆర్.అంకిత (1000/949) మార్కులు, బైపీసీలో పి.సింధు(1000/970) మార్కులు సాధించినట్లు ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ ఓబుళపతి తెలిపారు. మండల జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు 70 మందికిగాను 63 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 104 మందికిగాను 78 మందిపాసై 91 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణనాయక్ తెలిపారు. ఆదర్శ జూనియర్ కళాశాలలో 90 శాతం, కస్తూర్బా జూనియర్‌కళాశాలలో 80 శాతం, అంబేడ్కర్ గురుకుల జూనియర్‌కళాశాలలో 88 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పద్మ, శోభారాణి తెలిపారు.

ఇస్రో టూర్‌కు నీలకంఠాపురం విద్యార్థుల ఎంపిక


కావ్య చరణ్

మడకశిర రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠాపురం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు కావ్య, చరణ్ ఇస్రోటూర్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయలు రంగస్వామి తెలిపారు. విద్యార్థుల ఎంపికపట్ల మాజీ మంత్రి రఘువీరారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ద్విచక్రవాహనానికి నిప్పు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామభద్రాలయం వీధిలో ద్విచక్రవాహనానికి నిప్పు పెట్టిన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ప్రతి రోజులాగే తాను ఇంటిముందు వాహనాన్ని నిలిపానని, ఉదయం పంచాయతీ కార్మికులు వాహనానికి మంటలు చెలరేగాయని తెలుపడంతో వచ్చి చూశానని బాధితుడు చంద్రశేఖర్ పోలీసులకు తెలిపాడు. అప్పటికే వాహనం దగ్ధమైందన్నారు. పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.





ఆర్థిక సాయం అందజేత

గోరంట్ల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయం కాలనీకి చెందిన లక్ష్మీదేవి అనారోగ్యానికి గురికాగా చికిత్సకోసం టీడీపీ నాయకులు రూ.27వేలు ఆర్థికసాయం శనివారం అందించారు. కూరాకుల ఆదినారాయణ భార్య లక్ష్మీదేవి కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. నిమ్మల శ్రీధర్ ఆధ్వర్యంలో మాజీ వార్డు సభ్యులు క్రిష్ణమూర్తి, ఆది, వెంకటేశ్వర్లు, త్యాగరాజు, శీనా రూ.27వేలను ఆమె ఇంటికెళ్లి అందించారు.


అంజినప్పకు కేక్ తినిపిస్తున్న వడ్డెర సంఘం నాయకులు


కేక్ కట్‌చేస్తున్న అంజినప్ప, మునిసిపల్ చైర్మన్ రమేష్ తదితరులు

ఘనంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడి పుట్టినరోజు

హిందూపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప జన్మదిన వేడుకలు శనివారం ఆయన స్వగ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఉదయం నుంచి తెలుగుదేశం పార్టీనాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున కొల్లకుంటకు తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అంజినప్ప గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన నివాసం వద్ద భారీ కేక్‌కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీనాయకులు, కార్యకర్తలు, వడ్డెర సంఘం నాయకులు పెద్దఎత్తున తరలి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అంజినప్ప మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడిగా చేసిన పార్టీకి రుణపడి ఉంటానన్నారు. ఇంత పెద్దఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ తరుణంలో పలువురు జిల్లాకు చెందిన ముఖ్య నేతలు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపినట్లు తెలిపారు. జన్మదిన వేడుకల్లో మునిసిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ నాయకులు ఆర్ఎంఎస్ షఫీ, హెచ్ఎన్ రాము, వెంకటగిరిపాళ్యం శ్రీనివాసులు, నవీన్, నంబూరిసతీష్, టైలర్ గంగాధర్, చంద్రశేఖర్, అనీల్, నాగభూషణ, శ్రీరాములు, సంజీవరాయుడు, పెద్దన్న, హనుమయ్య, సుబ్బారావు, మధు, రంగప్ప, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


అగళి రామాపురం ఆలయంలో ప్రత్యేక అలంకరణ


గుండుమలలో పాల్గొన్న తిప్పేస్వామి

వైభవంగా హనుమజ్జయంతి

హనుమజ్జయంతి సందర్భంగా శనివారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు ఇచ్చారు.


కావలి కొండ వద్ద..

'జైభీమ్ ర్యాలీ విజయవంతం చేద్దాం'

పెనుకొండ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): భారతరాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని సోమవారం పండగలా నిర్వహిద్దామని బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు న్యాయవాది శివరామక్రిష్ణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో అంబేడ్కర్ జయంతి వేడుకల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామక్రిష్ణ, ఆనంద్, బాబుప్రసాద్, కదిరప్ప మాట్లాడుతూ బహుజన చైతన్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి రోజు ఉదయం పట్టణంలో జైభీమ్ ర్యాలీ, బహిరంగసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, రామాంజినేయులు, రవికుమార్, నరసింహులు, రాము, ఆంధ్రూస్ పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

సోమందేపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివానగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. కుక్క విషయంగా పోతుల కిష్టప్ప ఇంటివద్దకు వెళ్లగా దాడిచేసినట్లు రామాంజినేయులు, కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే పావురాలు దొంగలించడానికి వచ్చి తమతో గొడవపడినట్లు పోతుల కిష్టప్పకుటుంబ సభ్యులు బోయగంగాధర్ ఫిర్యాదుచేశారు. దీంతో ఇరు వర్గాలపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

లేపాక్షి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తెగిన విద్యుత్‌వైర్‌కు తగిలి ఆవు మృతి చెందింది. ఈ ఘటన కొండూరులో చోటు చేసుకుంది. మల్లికార్జున ఆవును మేపడానికి పొలం వద్దకు వెళ్తుండగా వ్యవసాయ మోటారుకు విద్యుత్ సరఫరా చేసే 11కేవీ వైరు తెగిపడిపోయింది. అదేదారిలో ఆవు వెళ్తున్నా రైతు గమనించలేదు. ఆవు వైరుకు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పరిగి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పరిగి నుంచి మడకశిర వెళ్లే ప్రధాన రహదారిలో బోయ కాలనీ సమీపంలో కారు అదుపుతప్పి యువకుడు మృతిచెందగా ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాల మేరకు మడకశిర మండలం మనూరు గ్రామానికి చెందిన బాలచంద్ర, విజయ్ బెంగళూరులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిని స్వగ్రామానికి తీసుకురావడానికి వెళ్లిన కారు డ్రైవర్ లక్ష్మీనరసింహ(28) స్వగ్రామానికి వస్తూ పరిగి వద్ద కుక్క అడ్డురావడంతో తప్పించబోయి పక్కనే ఉన్న గొర్రెల షెడ్డుకు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో లక్ష్మీనరసింహ అక్కడికక్కడే మృతిచెందగా బాలచంద్ర, విజయ్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్కౌట్స్ యూనిట్లు ప్రారంభం

రొళ్ల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో శనివారం భారత్ స్కౌట్స్ యూనిట్లు ప్రారంభించినట్లు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కౌట్ యూనిఫాంలను వైస్ ప్రిన్సిపాల్ రమేష్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ సుమజగన్నాథ్ పంపిణీ చేశారు.

స్థల పరిశీలన

రొళ్ల, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగనపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ భూమిపూజ కార్యక్రమానికి ఈనెల 17వతేదీ విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రానున్న నేపథ్యంలో ఆయన పర్యటించే స్థలాన్ని టీడీపీ నాయకులు శనివారం పరిశీలించారు. మండల కన్వీనర్ దాసిరెడ్డి, మడకశిర మార్కెట్‌యార్డు చైర్మన్ గురుమూర్తి, నాయకులు జి.కె.ఈరన్న, రొళ్లకొండ రామకృష్ణ, ఆనంద్, బ్యాడగెరె మూర్తి, కాకి వైస్ సర్పంచి రాజు ఏర్పాట్లను పరిశీలించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిని కలిసిన జిల్లా కోకన్వీనర్



పెనుకొండ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని బీజేపీ జిల్లా కో కన్వీనర్ గోపీనాథ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంపత్ అభినయ్ కార్యక్రమం గురించి చర్చించినట్లు గోపీనాథ్ తెలిపారు.